ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్
STATE VISION

బుధవారం 16-09-2026 పేజీలు : 16

## అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ దాడులు

- ఇద్దరి అరెస్టు..
- 6 లీటర్ల గుడుంబా స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు తండాల్లో అక్రమంగా మద్యం తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఆల్మాస్‌పూర్ తండా, గుంటపల్లి చెరువు తండా,



16 పేజీలో...

# పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్లు పూర్తి !

**గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు**

**- కూన శ్రీశైలం గౌడ్ ఘన సన్మానం**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కలిసి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి అభినందించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, దీపక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలి

**- తహసీల్దార్‌కు శివంపేట యువకుల ఫిర్యాదు**

15 పేజీలో...

## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులు



- **పార్టీ సంస్థాగత బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని సూచన**

మల్హర్, సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : ఇటీవల నూతనంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన మహాదేవపూర్, మహాముత్తారం, కాటారం, మలహర్ మండలాల అధ్యక్షులు జాడి రాజయ్య, కట్కం అశోక్, తెప్పెల దేవేందర్ రెడ్డి, జంగిడి శ్రీనివాస్ లు మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మకంతో మండల అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు మంత్రి శ్రీధర్ బాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో నెలకొన్న అభివృద్ధి, ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. మండల అధ్యక్షులు వివరించిన సమస్యలపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎమ్మార్వోను కలిసిన గ్రామస్తులు

- శివంపేట, తర్దనపల్లి శివార్లలో అక్రమ మట్టి తవ్వకాలు?
- అధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితమా..

**రాత్రివేళల్లో టిప్పర్లతో మట్టి తరలింపు**

- మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల తీరుపై స్థానికుల ఆగ్రహం

చౌటకూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట, తర్దనపల్లి గ్రామాల శివార్లలో అక్రమంగా మట్టి, మొరం తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

16 పేజీలో...




# అందరికీ సంక్షేమ ఫలాలు !

- జామ్డలో ఇందిరమ్మ ఇళ్లు.. పంచాయతీ భవనం ప్రారంభం
- బాలన్‌పూర్‌లోనూ కొత్త పంచాయతీ భవనం ప్రారంభం

నార్నూర్, సెప్టెంబర్ 15( విజన్ ఆంధ్ర ):అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



14 పేజీలో...



# ఘనంగా విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు

మందమర్రి, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : స్థానిక సింగరేణి ఎల్లందు క్లబ్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే) వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఇంజనీర్లను, అధికారులను జిఎం ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గంట్రావుపల్లిలో మహిళ అదృశ్యం

- 10 రోజులైనా లభించని మద్దెల తిరుపతమ్మ ఆచూకీ
- పెద్దకొత్తపల్లి పోలీసులను ఆశ్రయించిన కుమారుడు రాజు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామానికి చెందిన మద్దెల తిరుపతమ్మ (58) అనే మహిళ ఈ నెల 5వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరారు. అయితే నేటికీ ఆమె తిరిగిరాకపోవడంతో పాటు ఆచూకీ కూడా లభించలేదని ఆమె కుమారుడు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆమె అదృశ్యమై నేటికీ 10 రోజులు కావస్తుండటంతో, ఆందోళన చెందిన ఆమె పెద్ద కుమారుడు మద్దెల రాజు ఈ నెల 11వ తేదీ (శుక్రవారం) పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పెద్దకొత్తపల్లి ఎస్సై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు వెంటనే పెద్దకొత్తపల్లి పోలీసులకు గానీ, కుటుంబ సభ్యులకు గానీ 9704555718, 8790316449, 9550659664 ఫోన్ నంబర్లలో సమాచారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# 24 గంటల కరెంటు ఇవ్వాలని పార్టీలకతీతంగా రోడ్డెక్కిన రైతులు

- సబ్ స్టేషన్ ను ముట్టడించిన రైతులు

కోడేరు సెప్టెంబర్15 (విజన్ ఆంధ్ర) మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్న రైతులు ఏకమై 24 గంటల కరెంటు ఇవ్వాలని పార్టీలకతీతంగా రోడ్డుపై కూర్చొని ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు వివిధ గ్రామాలకు వెళ్తున్న వాహనాలను ఆపి నిరసన వ్యక్తం చేశారు. 24 గంటల కరెంట్ ఇవ్వకపోతే పంటలు చేతికి రావడం కష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ చాలక సాగు నీరు అందక ఇప్పటికే పంటలు ఎండుతున్నాయని 24 గంటల కరెంటు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యాక్రమంలో జనంపల్లి తీగలపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..

**- సర్పంచ్ స్వాతి జగనాథ్**

గాదిగూడ,సెప్టెంబర్15(విజన్ ఆంధ్ర ): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మట్టి గణపతులను పూజించాలని సర్పంచ్ స్వాతి జగనాథ్ అన్నారు.మంగళవారం గాదిగూడ మండలంలోని కొలమా గ్రామ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన మట్టి గణేష్ నిమర్జన ఉత్సవంలో సర్పంచ్ స్వాతి జగనాథ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ,కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు నేతాజీ,పంచాయతీ కార్యదర్శి రాదేశ్యామ్,విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

- రైతులకు కిట్ల పంపిణీ.. చేసిన మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్

చారకొండ,సెప్టెంబర్ 15(విజన్ ఆంధ్ర)మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో చీవీచీఫ్ (నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్) పథకం కింద రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ ముఖ్యంగా హాజరై రైతులకు ప్రకృతి వ్యవసాయం, దాని ప్రయోజనాలు,సాగులో పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ మాట్లాడుతూ, రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు భూసారం, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు.రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు,పథకం ద్వారా అందే ప్రయోజనాలపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఏఈవో అనూష,గ్రామ సర్పంచ్ పార్వతమ్మ,వ్యవసాయ శాఖ సిబ్బంది,తిమ్మాయిపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థుల డిజిటల్ విద్యకు తోడ్పాటు

- తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఎల్ఈడీ టీవీ అందించిన రాజేష్ గౌడ్

చారకొండ,సెప్టెంబర్ 15(విజన్ ఆంధ్ర)విద్యార్థులకు డిజిటల్ విద్యను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన వంగూరు రాజేష్ గౌడ్ స్థానిక ప్రాథమిక పాఠశాలకు ఎల్ఈడీ టీవీని అందించారు.విద్యార్థుల అభ్యసనకు,పాఠ్యాంశాలను దృశ్యరూపంలో సులభంగా అర్థం చేసుకునేందుకు ఈ టీవీ ఎంతగానో ఉపయోగపడుతుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి చారకొండ ఎస్ఐ వీరబాబు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు,గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి ఆధునిక విద్యా విధానంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని,విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. పాఠశాల అవసరాన్ని గుర్తించి ఎల్ఈడీ టీవీ అందించిన రాజేష్ గౌడ్‌ను అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక వసతులు అందుబాటులోకి రావడం వల్ల వారి అభ్యసన సామర్థ్యం మరింత మెరుగుపడే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు.పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు,దాతలు సహకరించడం అభినందనీయమని అన్నారు.




కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్,మండల నాయకులు శ్రీపతి రావు, ఉపాధ్యాయురాలు రజిని, యాదయ్య సేటు,కృష్ణారావు, మహేశ్, వెంకటేష్,వెంకయ్య, మల్లేష్,వంశీ,పవన్,నాని,రాజు తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి:
- ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏర్ర,చిన్నయ్య

చారకొండ,సెప్టెంబర్ 15(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతి ఐదేళ్లకు చట్టబద్ధంగా రావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.చిన్నయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చారకొండ మండలంలో టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏ.చిన్నయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఉద్యోగ,ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏ.చిన్నయ్య డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని,ప్రభుత్వం బకాయిపడిన ఆరు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని కోరారు.ఉద్యోగులు,ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి వైద్య సదుపాయాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని అన్నారు.

ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలకు ఇబ్బందికరంగా మారిన జీవో నంబర్ 25ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని ఏ.చిన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రాష్ట్ర నాయకులు కె. లింగమయ్య మాట్లాడుతూ ఈ నెల 18న



టీజేఏసీతో ముఖ్యమంత్రి జరపనున్న చర్చల్లో పీఆర్సీలో 45 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని,ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని తెలిపారు.

మండల ప్రధాన కార్యదర్శి యం. రాంబిక్మయ్య,గౌరవ అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనా,బోధనేతర సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.ప్రతి కేజీబీవీలో కేర్‌టేకర్‌ను నియమించాలని, ఎస్ఓలను ప్రిన్సిపాళ్లుగా,పీజీ సీఆర్టీలను లెక్చరర్లుగా, సీఆర్టీలను ఎస్ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సి.కృష్ణయ్య,జిల్లా నాయకులు పి. నారాయణ,యాతం రామకృష్ణ, బి.నాగభూషణం,హరిలాల్, ఆంజనేయులు,రాజు,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల్లో విద్యుత్ జాగ్రత్తలు తప్పనిసరి!

- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా మండపాలు
- ఎంసీబీ, ఆర్‌సీసీబీ ఏర్పాటు చేసుకోవాలి
- అనధికారిక కనెక్షన్లకు స్వస్తి: డివిజనల్ ఇంజనీర్ పోతు రాజు జాన్
- ఉచిత విద్యుత్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మేడ్చల్ డివిజనల్ ఇంజనీర్ పోతు రాజు జాన్ సూచించారు. ఉత్సవాల సమయంలో విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు తగినంత సురక్షిత దూరంలోనే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

భద్రతా పరికరాలు తప్పనిసరి: మండపాల్లో నాణ్యమైన విద్యుత్ వైరింగ్‌ను మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణ కోసం ఎంసీబీ, ఆర్‌సీసీబీ వంటి రక్షణ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వైరింగ్ పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తోనే చేయించాలని స్పష్టం చేశారు. నాసిరకం వైర్లు, పరికరాలను వినియోగించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

హుకింగ్‌కు దూరంగా ఉండాలి: విద్యుత్ లైన్లకు నేరుగా హుకింగ్ వేయడం, అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడం చట్టరీత్యా నేరమని పోతు రాజు జాన్ తెలిపారు. ఇలాంటి చర్యలు విద్యుత్ ప్రమాదాలకు, ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది సూచనలు, నిబంధనల మేరకే మండపాలకు విద్యుత్ కనెక్షన్లు పొందాలని నిర్వాహకులకు సూచించారు.

ఉచిత విద్యుత్ సదుపాయం: గణేష్ మండపాలకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు డివిజనల్ ఇంజనీర్ తెలిపారు. ఇందుకోసం విద్యుత్ శాఖ సిబ్బంది మండపాలను సందర్శించి, టీజీఎస్‌పీడీసీఎల్ సాసా యాప్ ద్వారా ఉచిత విద్యుత్ కనెక్షన్ కోసం నమోదు ప్రక్రియ చేపడుతున్నారని వివరించారు. నిర్వాహకులు అనధికారిక కనెక్షన్లకు పాల్పడకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్రమత్తతే రక్షణ: మండపాల వద్ద విద్యుత్ తీగలు, విద్యుత్ పరికరాలను నిర్లక్ష్యంగా నిర్వహించరాదని ఆయన సూచించారు.



విద్యుత్ వైరింగ్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత విద్యుత్ సిబ్బంది సూచనలు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ తీగలు తెగిపడినా, సరఫరాలో సమస్య తలెత్తినా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని కోరారు.

ఫిర్యాదులకు 1912: అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయడంతోపాటు వాట్సాప్ నంబర్ 87124 41912కు ఫిర్యాదు చేయవచ్చని పోతు రాజు జాన్ తెలిపారు. భక్తులు, నిర్వాహకుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

---

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం

### - పీఆర్‌టీయూ-టీఎస్ మండల అధ్యక్షుడు మెస్రం లింగు ఐదవ సారి ఏకగ్రీవం



గాదిగూడ, సెప్టెంబర్ 15(విజన్ ఆంధ్ర):గాదిగూడ మండల పీఆర్‌టీయూ–టీఎస్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ -టీఎస్ భావనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షులు మెస్రం లింగు,ప్రధాన కార్యదర్శి రొండ్ల శ్రవణ్ కుమార్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులు బద్దం చైతన్య రెడ్డి చౌహాన్ దీపక్, రాష్ట్ర జిల్లా అసోషియేషన్ అధ్యక్షులు మెస్రం శేఖర్,చౌహాన్ దిలీప్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.ఐదవ సారి ఏకగ్రీవంగా మండల అధ్యక్షులుగా మెస్రం లింగు,రొండ్ల శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి,కుడ్మేత ఈటా మహిళా అసోషియేషన్ అధ్యక్షులు,జంగ్నక్ తుకారాం ఉపాధ్యక్షులు,తురం యశోద మహిళా ఉపాధ్యక్షులు, కుంరం కృష్ణ కార్యదర్శి,రాథోడ్ జ్యోష్న మహిళా కార్యదర్శిలుగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర అసోషియేషన్ అధ్యక్షుడు మెస్రం శేఖర్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ–టీఎస్ రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘమని అన్నారు.ఉపాధ్యాయులకు మెరుగైన వేతన సవరణ సాధించడంతో పాటు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ,సర్వీసు నిబంధనల సమస్యలు, పెండింగ్ కరువు భత్యాల చెల్లింపు వంటి అంశాలపై పోరాడుతామని తెలిపారు.

## టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హేమంత్ చారి



జన్నారం, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జన్నారం మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన హేమంత్ చారి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాష్ట్ర చైర్మన్ నవీన్ పెట్టం నియా మక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హేమంత్ చారి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల ను కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి ప్ర భుత్వం ఏర్పడేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.అదేవిధంగా నాపై నమ్మకంతో కార్యదర్శి పదవి నుండి ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి కల్పిం చిన చైర్మన్ నవీన్ పెట్టం, ముఖ్యమంత్రి రేవంత్ రె డ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లకు నా హృదయపూ ర్వక ధన్యవాదాలు తెలువుతున్నట్లు తెలిపారు.

## ముధోల్ మండలంలో రూ.4.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్



భైంసా : సెప్టెంబర్ 15 : విజన్ ఆంధ్ర : ముధోల్ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మంగళవారం భైంసాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. మొత్తం రూ.4.80 లక్షల విలువైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే, ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బోస్లే నారాయణరావు పటేల్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా బోరేగాం గ్రామానికి చెందిన ఎర్రం పోసాని, భర్త ముత్తన్నకు రూ.33,500, అష్ట గ్రామానికి చెందిన ఇందూరు నాగభూషణ్, తండ్రి నారాయణకు రూ.39,000, విట్టొలి గ్రామానికి చెందిన కాలేవారు నాగారం, తండ్రి సాయన్నకు రూ.10,000, ఎడ్బిడ్ తండాకు చెందిన జాదవ్ పార్వతీబాయి, భర్త నచ్చారాకు రూ.21,000, తరుడా గ్రామానికి చెందిన మహబూబ్ ఖాన్‌కు రూ.60,000, ముధోల్‌కు చెందిన షేక్ జావిద్ అహ్మద్‌కు రూ.35,500, కారేగాం గ్రామానికి చెందిన అన్నముల్ల ఈశ్వర్‌బాయి, భర్త పేరుకు రూ.47,500 చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. అలాగే ఎడ్ బీడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డికి గతంలో రూ.5 లక్షల సహాయం అందగా, తాజాగా మరో రూ.2.50 లక్షల విలువైన ఎల్‌ఓసీని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని బోస్లే నారాయణరావు పటేల్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావుల రంగారెడ్డి, ముధోల్ నియోజకవర్గ రైతు నాయకుడు ప్రేమ్‌నాథ్ రెడ్డి, ముధోల్ మండల ఉపాధ్యక్షుడు అజీజ్ జమీల్, పోతారెడ్డి, అంజద్ ఖాన్, ఎస్.కె. నాజిమ్ అహ్మద్, ముధోల్ మండల సామాజిక మాధ్యమాల సమన్వయకర్తతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో శాంతి సమావేశం – ఇన్‌స్పెక్టర్ రవి కుమార్

గజ్వేల్, 15 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని కోల అభిరామ్ ఫంక్షన్ హాల్లో గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. రవి కుమార్ ఆధ్వర్యంలో, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ సమన్వయంతో గణేష్ నవరాత్రుల శాంతి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు మరియు సుమారు 400 మంది మండప నిర్వాహకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. రవి కుమార్ మాట్లాడుతూ డీజేలు, మైకులు మరియు అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదు. ప్రభుత్వ శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిమజ్జన ఊరేగింపుల్లో మద్యం సేవించి పాల్గొనకూడదని, యువత క్రమశిక్షణ పాటించి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలన్నారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా పోలీసు శాఖ సూచనలను, నిబంధనలను పాటించాలన్నారు. మండపాల వద్ద తగిన భద్రత, విద్యుత్ జాగ్రత్తలు వహిస్తూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వేడుకలు నిర్వహించాలన్నారు. నవరాత్రులు మరియు నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సమన్వయంతో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.



## ఉట్ల కోనేరు యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన

అచ్చంపేట సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఉట్ల కోనేరు సమీపంలో ఉట్ల కోనేరు యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. యువత ఐక్యతకు, ఆధ్యాత్మిక సేవాభావానికి ప్రతీకగా నిలుస్తూ యువజన సంఘం సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

వినాయక చవితి సందర్భంగా గణనాథుడికి మొదటి పూజా కార్యక్రమాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు లింగం కృష్ణ--వెంకటమ్మ దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా ఉట్ల కోనేరు యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వినాయక చవితి వేడుకలను భక్తి, శ్రద్ధలతో నిర్వహిస్తూ ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. యువత సమాజ సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సాదరాజు, ఉట్ల కోనేరు యువజన సంఘం సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చిరుత దాడిలో రెండు ఆవులు మృతి



గండీడ్, సెప్టెంబర్ 15,(విజన్ ఆంధ్ర) : చిరుత దాడి చేసి రెండు ఆవులు మృతి చెందిన సంఘటన పెద్ద వార్వాల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శివ్వని బాలయ్యకు చెందిన రెండు ఆవులు చిరుత దాడి చేయడంతో మృతి వాతపడ్డాయి. సోమవారం సాయంత్రం ఎప్పటి మాదిరి పశువులను పొలం దగ్గర కట్టేసి ఇంటికి వచ్చారు . రాత్రి 8:30 గంటల సమయంలో పశువులు అరుస్తుండడం తో సాలార్ నగర్ గ్రామస్తులు పశువుల అరుస్తున్న విషయాన్ని శివ్వని బాలయ్యకు తెలుపగా బాలయ్య ఆ ప్రాంత రైతులు పొలం దగ్గరికి వెళ్లగా అప్పటికే దాదాపు 10 గంటల సమయంలో రెండు పశువులు మృతి చెంది ఉన్నాయి పశువులపై చిరుత దాడి చేసిందని గ్రామస్తులు తెలిపారు గతంలో ఈ ప్రాంతంలో చిరుతలు దాదాపు పది పదిహేను వరకు పశువుల పై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. దాదాపు ఈ పశువుల విలువ దాదాపుగా 60000 ఉంటుందని బాధితుడు తెలిపాడు పశువులే జీవనాధారంగా బతుకుతున్న తనకు ప్రభుత్వంఆర్థిక సాహాయం అందించాలని కోరారు.

## ఎర్రవల్లి శ్రీ సరస్వతి నిలయంలో కొలువుదీరిన 'న్యూస్ పేపర్' విఘ్నేశ్వరుడు

### - చిన్నారుల సృజనాత్మకతకు ప్రతీకగా పర్యావరణహిత గణనాథుడి రూపకల్పన

ఎర్రవల్లి: విజన్ ఆంధ్ర పత్రిక సెప్టెంబర్ 15 : జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ) స్కూల్‌లో చిన్నారుల సృజనాత్మకత, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటిచెప్పేలా న్యూస్ పేపర్‌తో తయారు చేసిన వినాయకుడు భక్తిశ్రద్ధలతో కొలువుదీరాడు. గత 15 రోజులుగా విద్యార్థులు ఎంతో ఆసక్తి, శ్రమతో ఈ పర్యావరణహిత గణనాథుడిని రూపొందించారు.

న్యూస్ పేపర్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన 'బొజ్జ గణపయ్య' విద్యార్థులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులు మరియు సిబ్బంది ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ వీర గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ! పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కలుషితమైన రంగులు, రసాయనాల వినియోగం వల్ల నీరు కలుషితం కావడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని తెలిపారు. నీటిని వృథా చేయకుండా, పర్యావరణానికి హాని కలగకుండా పర్యావరణహిత వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందించవచ్చని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులందరికీ మంచి విజ్ఞానం, వినయం, విధేయతలు కలగాలని, విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ వారిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

న్యూస్ పేపర్‌తో వినాయకుడిని రూపొందించిన చిన్నారులను, వారికి సహకరించిన ఉపాధ్యాయులను చైర్మన్ శ్రీ వీర గోవర్ధన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీ వీర గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ శ్రీ వీర శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ శ్రీమతి మధులిక రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీ శివకుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎండి రఫీ, లోకేష్, వనజా, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్ కుమార్, అశోక్, రమేష్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మండల శక్తి కేంద్ర సమావేశంలో పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షులు గోపాలకృష్ణ

అయిజ సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం భూంపురం గ్రామంలో శక్తి కేంద్ర సమావేశం బిజెపి అయిజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది.

బిజెపి మండల అధ్యక్షులు గోపాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెప్పి గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలని ఏ ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదని అన్నారు. మహిళలకు రూ.2500, రైతు భరోసా రూ7500 ఫసల్ బీమా గ్యాస్ 500 రూపాయలకి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, నిరుద్యోగ భృతి ఇలా అనేక పథకాలు మంజూరు చేస్తామని అబద్దాలు చెప్పి ఇప్పటి వరకు కూడా ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు అని పేరుకు మాత్రమే, కాంగ్రెస్ ప్రభుత్వం,బిఆర్ఎస్. రెండు పార్టీలు ఒక డ్రామా ఆడుతున్నారు. ఈరోజు బిజెపి పార్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్ 22ఏ చట్టంపై చర్చించుకుందామని తెలిపినప్పటికీ ఒకరిపై మరొకరు అబద్దాలు చెప్పుకుంటూ అసెంబ్లీలో గొడవలు చేసుకుంటూ అసెంబ్లీని కాలయాపన చేస్తూ ముగిస్తున్నారు

అదేవిధంగా రాష్ట్రంలో ప్రతి గ్రామానికి రవాణా కరువైపోయినదని, ఇంకా రోడ్లు వరకు వస్తే పూర్తి కంకర తేలి చాలామంది ప్రమాదాలకు గురి అవుతున్నారు.ప్రతి పల్లెలో పథకాలు అమలవుతున్నాయి అంటే అవి కేవలం కేంద్ర బిజెపి ప్రభుత్వానికి సంబంధించిన పథకాలులిరాష్ట్ర ప్రభుత్వ మాత్రం ఎలాంటి హామీలను నెరవేర్చకుండగా ఈ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ పాలన సాగిస్తున్నదని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి కాషాయం జెండాను ఎగరవేస్తుందని తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బోయ వీరాంజనేయులు, అయిజ పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్ సవరణ భీమేష్, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

## 2వ వార్డులో కుక్కల బెడద

### కుక్కల దాడులతో బెంబేలు..

### పట్టించుకునేవారేరీ?

బెల్లంపల్లి సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణంలోని 2వ వార్డు పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ పాలిటెక్నిక్, విద్యార్థులు, బస్తీ ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలోనే కుక్కల బెడద పెరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?

వీధి కుక్కల నియంత్రణపై మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. సమస్యను వార్డు కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజల భద్రతకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు స్థానిక కౌన్సిలర్ ఉంచకపోవడం విడ్డూరంగా ఉంది





ఇప్పటికైనా స్పందించాలి

మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే తక్షణమే సమస్యపై దృష్టి సారించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థులు, ప్రజలకు ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు కొండ రమేష్ గౌడ్‌కు ఆత్మీయ సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 14 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌ను గొల్లపల్లి గౌడ సంఘం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం కమిటీ సభ్యులు కొండ రమేష్ గౌడ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందిస్తూ రాష్ట్ర స్థాయి సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం గొల్లపల్లి గ్రామానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారంతో పాటు సర్పంచుల హక్కుల పరిరక్షణ, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. తనను ఆత్మీయంగా సన్మానించిన గౌడ సంఘం కమిటీ సభ్యులకు కొండ రమేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యవారిపల్లిలో సొంత ఖర్చులతో రోడ్డు మార్గం

### - మాజీ సర్పంచ్ చొరవపై గ్రామస్థుల ప్రశంసలు

కోయిలకొండ. సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర గ్రామాభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే అభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తామని అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ విజయశ్రీ సురేష్ రావు తెలిపారు.?కోయిలకొండ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం నుండి సమీప తండా వరకు గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, దాదాపు 400 మీటర్ల మేర నూతన బాటను (రోడ్డు మార్గం) అందుబాటులోకి తీసుకువచ్చారు. సొంత ఖర్చులతో రహదారి నిర్మాణం:సుదీర్ఘ కాలంగా గ్రామానికి, తండాకు మధ్య సరైన రాకపోకలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు, గ్రామస్తులు మరియు తండావాసులు అందరూ ఏకమై తమ సొంత ఖర్చులతో రోడ్డుపై మట్టి కొట్టించి నూతన రహదారి మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు.


రహదారి సదుపాయం కలగడంతో రాకపోకల కష్టాలు తీరాయని



గ్రామ ప్రజలు, తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ విజయశ్రీ సురేష్ రావు చొరవను, సహకారాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తండావాసులు, స్థానిక యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## చిన్నోనిపల్లి లింక్ కెనాల్ ను ఆర్ డి ఎస్ 12ఏ కు కలపండి

### - జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన సింధనూర్ సర్పంచ్



అయిజ సెప్టెంబర్ 15( విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని సింధనూర్, కుట్కనూర్ గ్రామాల రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, మాజీ,ఎంపీటీసీ సుధారాణి రవిరెడ్డి, రైతులు విజయ్ కుమార్, దేవేందర్, జనార్ధన్ గౌడ్ లు మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ని కోరారు. గట్టు మండలం, చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్ డి ఎస్. కు ఏర్పాటు చేసే లింక్ కెనాల్ ద్వారా 12ఏ, కెనాల్ కు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసి కోరారు. 12ఏ, డిస్ట్రిబ్యూటర్ కింద దాదాపు వెయ్యి ఎకరాలు సాగు భూమి ఉందని వారు కలెక్టర్ కు వివరించారు. ప్రస్తుతం ప్రజల అవసరాలు తీర్చేందుకు తాగునీరు విడుదల చేయించడంతో పాటు , యాసంగి పంటకు సాగునీరు విడుదల చేయించాలని కలెక్టర్ కు విన్నవించారు. ఇట్టి విషయంపై స్పందించిన కలెక్టర్ రైతుల ప్రయోజనాలు కాపాడాలని ఆర్డీఎస్. చీఫ్ (సిఈ) ఇంజనీర్ ను ఫోన్లో ఆదేశించారు.


## అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలి

### – తహసీల్దార్‌కు శివంపేట యువకుల ఫిర్యాదు

చౌటకూర్ సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర):– మండల పరిధిలోని శివంపేట గ్రామ శివారులో రాత్రి వేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తూ పట్టుబడిన టిప్పర్, ఎక్స్‌కవేటర్‌పై కేసు నమోదు చేసి, వెంటనే సీజ్ చేయాలని గ్రామానికి చెందిన యువకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, ఎంపీపీ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అలీం ఆధ్వర్యంలో పలువురు యువకులు, రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లారు.

రాత్రి వేళల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, మొరం తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ అనుదీప్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 11వ తేదీ రాత్రి పట్టుబడిన వాహనాలతో పాటు వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఆనుకుని ఉన్న స్థలంలో భారీ గుంతలు తవ్వి మట్టిని తరలించడంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గుంతలు నీటితో నిండిపోయాయని, విద్యార్థులెవరైనా ప్రమాదవశాత్తు అందులో పడితే ప్రాణాపాయం జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే, పట్టుబడిన వాహనాలను ఇప్పటికే పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినప్పటికీ, రెవెన్యూ అధికారులు ఎలాంటి కేసు నమోదు చేయకుండా కేవలం తాళాలు మాత్రమే పోలీసులకు అప్పగించి వచ్చారని బాధితులు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో సాగుతున్న అక్రమ మట్టి వ్యాపారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం



లేదని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను వదిలిపెట్టవద్దని, వాటి ధ్రువపత్రాలను పరిశీలించి కోర్టులో డిపాజిట్ చేయాలని పట్టుబట్టారు. కేసు నమోదు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం: ఇన్‌ఛార్జ్ తహసీల్దార్

ఈ విషయమై ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ అనుదీప్ స్పందిస్తూ.. అక్రమ రవాణాపై చట్టపరంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా ఎవరైనా మట్టి, మొరం తరలిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్రమ వ్యాపారానికి పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ప్రజాసేవకు గౌరవ డాక్టరేట్ !

- డాక్టర్ నరేందర్ గౌడ్‌కు మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సత్కారం
- కోవిడ్ సమయంలో సుమారు 500 మందికి అండగా నిలిచిన సేవ
-- ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య సేవలకు గుర్తింపు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): ప్రజాసేవను జీవిత ధ్యేయంగా ఎంచుకుని, ప్రజారోగ్య రంగంలో నిరంతరం సేవలందిస్తున్న డాక్టర్ మండాది నరేందర్ గౌడ్‌కు ప్రతిష్ఠాత్మక గౌరవం లభించింది. సామాజిక సేవ, ఆరోగ్య సేవలు, ఉచిత వైద్య శిబిరాల ద్వారా అందించిన సేవలను గుర్తించిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆయనను ఎంపిక చేసి హానరరీ డాక్టరేట్ అవార్డు--2026తో సత్కరించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామానికి చెందిన మండాది మల్లయ్య, పద్మ దంపతుల చిన్న కుమారుడు నరేందర్ గౌడ్. చిన్ననాటి నుంచే ప్రజలకు సేవ చేయాలనే ఆసక్తితో ముందుకు సాగిన ఆయనకు మేనమామ బొల్లికొండ వెంకటనారాయణ ప్రోత్సాహం అందించారు. మధిరలో బొల్లగాని వీరభద్రం దంపతుల సహకారంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. అనంతరం శీలం వెంకటరెడ్డికి శిష్యుడిగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయుర్వేద రంగంలో గవర్నమెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామాచార్యుల వద్ద శిష్యుడిగా చేరి పలు ఆరోగ్య శిబిరాల్లో పాల్గొన్నారు. ఈ అనుభవంతో ప్రజారోగ్యంపై మరింత ఆసక్తి పెంచుకున్నారు. వైద్య రంగంలో సేవ చేయాలనే లక్ష్యంతో హెల్త్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి కొంతకాలం ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేశారు. ఉచిత వైద్య సేవలకు శ్రీకారం: ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో 2016లో సొంతంగా మెడికల్ షాప్‌తో పాటు ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలు, ఆరోగ్య సలహాలు అందిస్తున్నారు.

కోవిడ్‌లో సేవా స్ఫూర్తి: కోవిడ్ మహమ్మారి సమయంలో నరేందర్ గౌడ్ తన సేవలను మరింత విస్తరించారు. బాధితులకు స్వచ్ఛందంగా ఉచిత మందులు, ఆక్సిజన్, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సుమారు 500 మంది కోవిడ్ బాధితులకు అవసరమైన సహాయం అందించినట్లు తెలిపారు.

గతంలోనూ అవార్డులు: ఆయన సేవలను గుర్తించిన పలు సంస్థలు గతంలోనూ సత్కరించాయి. 2020లో 'సేవారత్న', 2021లో 'వైద్యరత్న' అవార్డులను రవీంద్రభారతిలో అందుకున్నారు. తాజాగా ఢిల్లీ సెక్టార్--20లోని ది కస్టల్ ఆర్ట్ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో హానరరీ డాక్టరేట్ అవార్డు--2026ను నరేందర్ గౌడ్‌కు ప్రదానం చేశారు. పీహెచ్‌హెచ్‌డీఎంబీఆర్ చైర్మన్ డాక్టర్ సీపీ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు అడ్వకేట్ డాక్టర్ గీతాంజలి శర్మ తదితరుల చేతుల మీదుగా ఈ గౌరవాన్ని అందుకున్నారు. ప్రజారోగ్యం, సామాజిక సేవ, ఉచిత వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్న సేవలకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ప్రజాసేవను మరింత విస్తృతంగా కొనసాగించేందుకు ఈ పురస్కారం తనకు ప్రేరణగా నిలుస్తుందని డాక్టర్ నరేందర్ గౌడ్ పేర్కొన్నారు.



## విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా

గండీడ్ సెప్టెంబర్ 15( విజన్ ఆంధ్ర ) : గండీడ్ మండల పరిధిలోని సల్కార్ పెట్ సబ్ స్టేషన్ ముందు మంగళవారం కరెంటు కోతలకు నిరసనగా మండలంలోని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు , నాయకులు మహా ధర్నా నిర్వహించారు

రైతుల కరెంటు కోతల కష్టాలు తీర్చాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్ రెడ్డి అన్నారు ధర్నాలో పాల్గొని బి ఆర్ ఎస్ రైతులకు 24 గంటల కరెంటు నిర్విరామంగా ఇవ్వడం జరిగింది. ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ రైతులకు సరిపోను కరెంటు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు ఈ ధర్నాలో పాల్గొని రైతులకు న్యాయం చేకూర్చాలని మండల విద్యుత్ శాఖ ఏ,ఈ కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. మాజీ జెడ్పిటిసి సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు దిడ్డికడిగోపాల్ ఆయా గ్రామాల టిఆర్ఎస్ పార్టీ సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నేడు అచ్చంపేట పట్టణంలో విద్యుత్తు నిలిపివేత

అచ్చంపేట సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : అచ్చంపేట విద్యుత్తు సబ్ స్టేషన్ నుంచి పలకపల్లి సబ్ స్టేషన్ వరకు కొత్త లైన్ వేయడం జరుగుతుంది ఈ కారణంగా నేడు బుధవారం అచ్చంపేట పట్టణంలో వెంకటేశ్వర కాలనీ మరియు మధుర నగర్ కాలనీలకు మధ్యాహ్నము 12 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు కావున అచ్చంపేట పట్టణ రెండు కాలనీల ప్రజలు వ్యాపారస్తులు సహకరించాలని కోరారు మరమ్మతు పనులు ముగియగానే విద్యుత్ సరఫరా జరుగుతుందని ఆయన తెలిపారు విషయం అందరు గమనించాలని కోరారు

## బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణంలో అనుమతులు లేని వ్యాపార సముదాయాలను తొలగించండి

బోథ్. సెప్టెంబర్ 15. (విజన్ ఆంధ్ర) గత కొన్ని సంవత్సరాలుగా అనుమతులు లేకుండా బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణలో కొనసాగుతున్న చిరు వ్యాపార సముదాయాలను తొలగించాలని ఎంపీడీఓ కు, పోలీసులకు బోథ్ గ్రామ పంచాయితీ ఈవో లకు బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా కొనసాగుతున్న వాటిని తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు సానుకూలంగా స్పందించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామని లేని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



# సెట్విన్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత పిలుపు ...**



మక్తల్, సెప్టెంబర్ 15 ( విజన్ ఆంధ్ర ) : మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత సూచించారు. మంగళవారం సెట్విన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె, కేంద్రంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, కంప్యూటర్ ట్రైనింగ్ లలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులను అడిగి శిక్షణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకిటి లలిత మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, స్పోర్ట్స్ యూత్ సర్వీసెస్ శాఖ మంత్రిగా ఉన్న వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తన శాఖలోనే అనుబంధంగా ఉన్న సెట్విన్ కేంద్రాన్ని మక్తల్ కు తీసుకువచ్చారని తెలిపారు. మక్తల్ ప్రాంత మహిళలు స్వయం ఉపాధితో తమకాళ్లపై తాము నిలబడాలని, నారాయణపేట, గద్వాల, వనపర్తి లాంటి జిల్లా కేంద్రాల్లో సైతం లేని సెట్విన్ ను... మక్తల్ లో ఏర్పాటు చేశారంటే ఈ ప్రాంతంపై మంత్రి వాకిటి శ్రీహరికి ఉన్న ప్రత్యేక అభిమానమని అన్నారు. త్వరలోనే సెట్విన్ కింద మరిన్ని విభాగాలకు సైతం శిక్షణను విస్తరించే యోచనలో మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, స్థానిక వార్డు కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య నీల గౌడ్, వార్డు కౌన్సిలర్ రహీం పటేల్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్మూరి రవికుమార్, నాయకులు చంద్రకాంత్ గౌడ్, అమర్, గోవిందరావు, నీలప్ప ముదిరాజ్, సెట్విన్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, ట్రైనర్లు తిమ్మప్ప, స్వప్న, వీరమ్మ, ఫర్హానా, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీ, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఎం. విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

**- సుల్తాన్‌పూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు**



చౌటకూర్ సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): పుల్కల్ మండల పరిధిలోని జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సుల్తాన్‌పూర్‌లో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని సర్ ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈ, ఎంహెచ్ఆర్‌డీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథ రాజు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, అది సమాజ అభివృద్ధికి దోహదపడే బాధ్యతాయుతమైన జీవన విధానమని విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులు కేవలం ఉద్యోగాల సాధనకే పరిమితం కాకుండా మెరుగైన భవిష్యత్తు కోసం కొత్త ఆలోచనలు, నిర్మాణాత్మక పరిష్కారాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని తెలిపారు. స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా హరిత సాంకేతికత వైపు పరిశోధనలు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచ స్థాయి ఇంజనీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శైలజ, ఈసీఈ విభాగాధిపతి వి. రాజనేష్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్వేత, అసోసియేట్ ప్రొఫెసర్ జోషి శ్రీపాద్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాసవి మాత ఆలయంలో ఘనంగా మొదటి రోజు మట్టి వినాయకుడి పూజ కార్యక్రమం

**పర్యావరణ రహిత మట్టి వినాయక పూజ**



మక్తల్ సెప్టెంబర్ 15 ( విజన్ ఆంధ్ర ): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణం వాసవి మాత దేవాలయం లో యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మొదటి రోజు పూజ మట్టి గణపతి దాత శ్రీమతి శ్రీ కల్వల శారద బాలనరసయ్య వారి కోడలు కుమారుడు కల్వాల్ లావణ్య రాకేష్ మనుమడు కల్వాల్ విహాన్ వారిచే,అహల్య హరదాత శ్రీమతి శ్రీ వట్టం పుష్పవతి శేఖరయ్య కుమారుడు కోడలు వట్టం అనూష రతన్ కుమార్, వట్టం వెంకటేష్ వారి కుటుంబ సభ్యులచే అలాగే శ్రీమతి శ్రీ దొంత విజయలక్ష్మి ఈశ్వరయ్య వారి కుమారుడు దొంత వెంకటేష్ కోడలు దొంత సరిత వారి కుటుంబ సభ్యులచే మరియు శ్రీమతి శ్రీ సంకలాపురం మాధవి రఘువీర్ వారి కుటుంబ సభ్యులచే ప్రతి సంవత్సరం లా ఈ సంవత్సరం కూడా గణపయ ఉత్సవాలు మొదటి రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది,ఇట్టి కార్యక్రమనికి అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాతుని ఆశీర్వాదలు పొందారు. పూజ అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ, అల్పాహారం ఏర్పాటు చేశారు.అలాగే మూడు రోజుల పాటు పూజ సమయం లో మహిళలచే రేపు కుంకుమార్చన,బుధవారం గరిక అర్చన, గురువారం మోదిక ఆకుల అర్చన ఉండును, ప్రతి రోజు డిప్ లో ఉన్న 30 తులాలు, 20 తులాలు, 10 తులాల వెండి గణపతి ప్రతిమ లకు పూజ జరుగును, 4 రోజుల పూజ అనంతరం 5 వ రోజు డిప్ తీయబడును, ఒక్క డిప్ టికెట్ ధర కేవలం 501 రూ. లు మాత్రమే అని ఉత్సవ కమిటీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూజా సేవాకర్తలు, భక్తులు, మహిళలు,పురుషులు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన శ్రీ గణపతి విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు. జిల్లాలో వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించి పండుగను సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయిశివాని, క్లాస్–-4 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్, పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన

### - అత్యవసర సమయంలో డయల్-112..
### - సైబర్ మోసాలకు 1930

ధరూర్ సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్,ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం ధరూర్ మండలం రేవులపల్లి గ్రామంలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, సీసీ కెమెరాల ప్రాధాన్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. కళాబృందం సభ్యులు ఆయా అంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే కీలక భద్రతా చర్య అని వివరించారు. హెల్మెట్‌ను సరైన విధంగా ధరించి స్ట్రాప్ బిగించుకోవాలని, వేగాన్ని నియంత్రించుకోవాలని, రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు.

ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్--112కు సమాచారం అందించాలని, సమాచారం అందిన వెంటనే సమీపంలోని బ్లూ కోల్ట్స్ సిబ్బంది స్పందిస్తారని తెలిపారు. పోక్సో చట్టం ప్రకారం బాలలు, బాలికలపై జరిగే లైంగిక నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు.మహిళలు, బాలికలను ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా షీ టీమ్ నంబర్ 8712670312కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బ్యాంకు వివరాలు, ఓటిపి, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు తమ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ధరూర్ హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్, కళాబృందం సభ్యులు రాధమ్మ, రామాంజనేయులు, షీ టీమ్ సభ్యులు లోకేశ్వరి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కోయిలకొండలో ప్రభుత్వ సేవలపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు

### - ఎం.పి.డి.ఓ కార్యాలయం, సి.హెచ్.సి, బి.సి బాలుర సంక్షేమ వసతి గృహం, జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలల్లో విస్తృత పరిశీలన

మహబూబ్‌నగర్: కోయిలకొండ మండల పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మండల కేంద్రంలోని ఎం.పి.డి.ఓ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి), బి.సి బాలుర సంక్షేమ వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాలు, సంస్థల్లో అందుతున్న సేవలు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు, మందుల లభ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు.

ఎం.పి.డి.ఓ కార్యాలయంలో పిటిషన్లు, సిబ్బంది హాజరు పరిశీలన

ముందుగా ఎం.పి.డి.ఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన పిటిషన్లు, దరఖాస్తులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్‌లో నమోదవుతున్న హాజరు వివరాలను తనిఖీ చేశారు. డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్ (డి.ఎస్.ఆర్), ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదవుతున్న హాజరు వివరాలను ఎం.పి.డి.ఓ లాగిన్‌లో పరిశీలించారు.

అనంతరం కార్యాలయానికి వచ్చిన బూరుగుపల్లి సర్పంచ్‌తో కలెక్టర్ మాట్లాడి గ్రామంలో పెండింగ్ బిల్లులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

గ్రామీణ యాప్‌లో నమోదైన వివరాలు, వివిధ పథకాల అమలు, నిధుల వినియోగానికి సంబంధించిన అంశాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత వివరాలను ఎం.పి.డి.ఓ ద్వారా సర్పంచ్‌కు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.సర్పంచ్ తెలిపిన

చెక్కులపై సంతకాల సమస్యపై ఉపసర్పంచ్‌ను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎం.పి.డి.ఓకు సూచించారు.

సి.హెచ్.సిలో వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా

అనంతరం జిల్లా కలెక్టర్ సి.హెచ్.సి సందర్శించి ఆసుపత్రిలోని రిజిస్టర్లు, మందుల నిల్వలను



పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు.

కొంతమంది రోగులు ఐరన్ మాత్రలు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ వెంటనే స్పందించారు. జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఇన్సులిన్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించి ఇన్సులిన్‌ను తెప్పించి సంబంధిత రోగికి అందించారు.

ఆసుపత్రిలో అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు.

బి.సి బాలుర సంక్షేమ వసతి గృహంలో వసతులు, ఆహారం పరిశీలన

అనంతరం కలెక్టర్ బి.సి బాలుర సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సిబ్బంది, స్టోర్‌రూమ్, ఆహార సరుకుల నిల్వలను పరిశీలించారు. పప్పు, ఇతర సరుకుల నిల్వలను పరిశీలించి, వాటిని విద్యార్థులకు సక్రమంగా అందిస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని ఆరా తీసిన కలెక్టర్, ఉదయం అందించిన అల్పాహారం వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాలలో పారిశుద్ధ్యం, విద్యార్థుల సౌకర్యాల పరిశీలన

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల పరిసరాలను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నారా, గతంలో ఎప్పుడు ఫాగింగ్ చేపట్టారనే వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.

అక్కడ ఉన్న సర్పంచ్‌ను పంచాయతీ కార్యదర్శి క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

10వ తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరగతి గదిలో ఫ్యాన్ పనిచేయకపోవడాన్ని గమనించిన ఆమె, వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచి వాతావరణంలో విద్యాబోధన జరిగేలా చూడాలని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని, మురుగు కాలువలను నిత్యం శుభ్రం చేస్తూ...



# భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు

### నిజాంపేట్‌లో పలు వినాయక మండపాలను సందర్శించిన భూపతిరెడ్డి

నిజాంపేట్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): వినాయక చవితి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ డివిజన్‌లోని కేటీఆర్ కాలనీ, బాలాజీ హిల్స్, వెంకటరాయ నగర్, కౌసల్య కాలనీ, దేవి హోమ్స్, శ్రీ హోమ్స్ తదితర కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. అనంతరం మండపాల నిర్వాహకులు, స్థానికులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోటపాటి మురళి, నిజాంపేట్ సర్కిల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, జిల్లా ప్రధాన కార్యదర్శి రావూరి మౌళేశ్వరరావు, పర్వతిని ఆంజనేయ వర్మ, బత్తుల చిరంజీవి, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

బోథ్, సెప్టెంబర్ 15. (విజన్ ఆంధ్ర) బోథ్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బోథ్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సారధి, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2023 సెప్టెంబర్ 17న ఎస్టీలకు 6 శాతం ఉన్న రిజర్వేషన్ ను 10 శాతానికి పెంచి మూడేళ్లు పూర్తి కావొస్తున్న సందర్భంగా గిరిజనులకు అందజేసిన సెప్టెంబర్ 17వ తేదీన నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని అన్ని గ్రామాల్లో కేసీఆర్ కు ధన్యవాదాలు తెలుపుతూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. 500 కు పైగా జనాభా ఉన్న గిరిజన తాండాలు, గూడేలు, అవసాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి స్థానికులను సర్పంచులుగా చేసిన ఘనత కేసీఆర్ దే అన్నారు . గిరిజనులకు పాలన చేతిలో అందించి వారి ఆత్మగౌరవానికి గుర్తింపు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# హమర ప్రసాద్ ను ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేయాలి

జన్నారం, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : హమర ప్రసాద్ ను ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేసి చట్టప రమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం జన్నారం మండల అధ్యక్షులు సిటీమల భరత్ కు మార్ డిమాండ్ చేశారు.హమర ప్రసాద్ డాక్టర్ బి .ఆర్ అంబేద్కర్ ను కించపరిచే విధంగా పుస్తకం రాయడాన్ని అంబేద్కర్ సంఘం నాయకులు తీ వ్రంగా ఖండిస్తూ మంగళవారం రోజున మండలకేం ద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్య క్తం చేశారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లా డుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీ యులు డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ ను కించపరిచే విధంగా పుస్తకం రాయడం హేయమైన చర్య అని ప్రభుత్వం వెంటనే హమర ప్రసాద్ ను అరెస్టు చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చ ర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్య, రాష్ట్ర నాయకులు బోర్ల కుంట ప్రభుదాస్,మాలమహానాడు మండల అధ్య క్షులు దాముక కరుణాకర్,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గోనె ప్రభాకర్ మాదిగ, జిల్లా నాయకు లు ప్రభుదాస్, సర్వంచల



ఫోరం మాజీ మండల కన్వీనర్ జాడి గంగాధర్, విజయ్, నాయకులు రత్నం మాణిక్యం, దుమ్మల ప్రవీణ్, జనుగురు మ ల్లయ్య, దుమల్ల ఎల్లయ్య తదితరులు పాల్గొ న్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా.. సమస్యలపై సత్వర స్పందన**

**- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు**

**గణేశ్ ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానం**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ తన వంతు కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్‌లో ఉన్న తన కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా, వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనాలని పలువురు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆహ్వానించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# మల్యాల గిరిజన గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

జన్నారం, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : జన్నారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వై ద్యాధికారిణి ఉమాశ్రీ ఆదేశానుసారం మంగళవా రం రోజున మండలంలోని మాల్యాల గ్రామంలో వైద్య బృందం వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సం దర్భంగా గ్రామంలోని గిరిజనులకు రక్త పరీక్షలు చే సి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అ నంతరం వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి ని వారణ చర్యల గురించి వివరించారు. ఇంటి చు ట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటు నీరు నిలువకుండా చూడాలని దోమల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి నవ నీల, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఏఎన్ఎం పద్మ పంచాయతీ కార్యదర్శి కలీం, ఆశా కార్యకర్త తిరుమల, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజ లు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**--పట్ట భద్రుల ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి**

సంగారెడ్డి డెస్క్ , విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 15: భారతదేశాన్ని సంపన్న దేశంగా మార్చేందుకు పీఎం మోదీ ఎంతగానో కృషి చేస్తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి అన్నారు. మంగళవారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17న పిఎం నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సేవా సంకల్ప పేరుతో అక్టోబర్ 17 వరకు నెలరోజుల పటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు బీజేపీ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ నెల 17 నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఇంట్లో దీపాలు వెలిగించి నరేంద్ర మోడీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. బ్లడ్ డొనేషన్, మొక్కలు నాటడంతో పాటు తదితర సేవా కార్యక్రమాలు నిర్వర్తించాలని ఆయన సూచించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జన్ దన్ అకౌంట్ ద్వారా ప్రజలకు ఎన్నో రకాలుగా మేలు జరుగుతుందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ప్రీమియంతో భీమా పథకాలను



అమలు చేస్తున్నామన్నారు. దేశంలో పీఎం కిసాన్ పథకం ద్వారా 12 కోట్ల మంది రైతులకు రూ. 6వేలు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. మహిళలకు, యువకులకు, వ్యాపారులకు అనేక రకాల రుణాలను సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. మన దేశ వనరుల దిగుమతులపై ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆధారపడి ఉన్నాయని, దీనికి కారణం పీఎం మోడీ పరిపాలన విధానమేనని ఆయన అన్నారు.

**-కాంగ్రెస్, బీఆర్ఎస్ లు భయపడుతున్నయ్; రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్**

తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంఐఎం కు భయపడుతున్నాయని రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్ అన్నారు. నిజాం పాలనకు నిరూమిక్ష పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆనాడు వల్లభాయ్ పటేల్ ద్వారానే తెలంగాణకు స్వాతంత్రం వచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు.

విమోచన ఉద్యమంలో 4వేల మంది అసువులు బాసారని ఆయన అన్నారు. బిజెపి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న ప్రతి మండలంలో జాతీయ జెండాలను ఎగురవేయాలని అయిన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు సి. గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనంతరావు కులకర్ణి, జిల్లా నాయకులు రమేష్ పాటిల్, గంగా జోగినాథ్, ప్రభాత్, జగన్నాథం, భూమయ్య, నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్, మండల నాయకులు శివచందర్, కదల రాములు, పాపయ్య, ఆంజనేయులు పలువురు పాల్గొన్నారు.

## సాదుల నగర్ గ్రామంలో శ్రీ బోనమ్మ వినాయక కమిటీ వద్ద ఘనంగా విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించిన కమిటీ సభ్యులు



విజన్ ఆంధ్ర హత్నూర హత్నూర మండల పరిధిలోని సాదుల నగర్ గ్రామంలో శ్రీ బోనమ్మ వినాయక కమిటీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించిన శ్రీ బోనమ్మ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాదుల నగర్ గ్రామ ప్రజలను పిల్లాపాపలను సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని ఆ విఘ్నేశ్వరుని కమిటీ సభ్యులు వేడుకున్నారు ప్రతి సంవత్సరం జరిగే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని భక్తి శతలతో వేద పండితుల వారిచే గణనాథునికి ఘనంగా పూజలు నిర్వహించడం జరిగిందని శ్రీ బోనమ్మ కమిటీ సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు విఘ్నేశ్వర భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఐదేళ్లుగా మట్టి గణపతుల సేవ.. సాదుల రాజు అభినందనీయం

నంగునూరు మండలం సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా నంగునూరు మండల కేంద్రంలోని భవాని నగర్–నల్లపోచమ్మ రోడ్డులో సాదుల రాజు గత ఐదేళ్లుగా స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, సర్పంచ్ సాదుల బాలపోచయ్య పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు అందజేశారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా కాపాడుకోవచ్చని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.గత ఐదేళ్లుగా సాదుల రాజు తన సొంత ఖర్చులతో మట్టి విగ్రహాలను తయారు



చేసి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నంగునూరు పీఏసీఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్, ఉపసర్పంచ్ శ్రీధర్ గౌడ్, జైపాల్ రెడ్డి, మహేందర్ గౌడ్, రజినీకర్ రెడ్డి, దాసరి రవి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సిద్దేశ్వర్ గౌడ్ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి సేవలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్

### గాజులరామారంలో గణేష్ చతుర్థి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): గణేష్ చతుర్థి సందర్భంగా గాజులరామారం గ్రామంలో నిర్వహించిన వినాయక చతుర్థి పూజా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ గణనాథుడి కృప కలగాలని ప్రార్థించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, ఇంద్రసేనాగుప్త, బాలరాజు, యాదగిరి, శ్రీరాములు, కూన రాఘవేందర్ గౌడ్, ముత్యపాగా లక్ష్మణ్, సురేష్, నరసింహారెడ్డి, నరేంద్రవర్మ, సాగర్, కూన నరేష్ గౌడ్, సుజిత్‌రెడ్డి, కూన వంశీ గౌడ్, యశ్వంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితో పాటు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బెల్లంపల్లి కొత్త బస్టాండ్ సమస్యపై ఎమ్మెల్యే స్పందించాలి: ఎంసీపీఐయూ




బెల్లంపల్లి సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణం కొత్త బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లకపోవడంతో ప్రయాణికులు, పాలిటెక్నిక్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసలేటి వెంకటేష్ అన్నారు. బస్సులను రోడ్డుపైనే నిలిపివేయడంతో విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల ముప్పు ఉందని పేర్కొన్నారు. వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆసిఫాబాద్ డిపో మేనేజర్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంటనే స్పందించి బస్టాండ్‌ను పరిశీలించి, బస్సులు లోపలికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## విద్యార్థినులకు కంటి పరీక్షలు



మహబూబ్ నగర్ : జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళ వారం రోజు కేజీబీవీ అర్బన్ (ఏనుగొండ )లోని 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు గల విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమమును ప్రారంభించారు.డి ఎమ్ హెచ్ ఓ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వున్న ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలలోని విద్యార్థిని, విద్యార్థులకు కంటిపరీక్షలు యాక్షన్ ప్లాన్ ప్రకారము నిర్వాహించాలని ఆదేశించారు.ఇంతకు ముందు గుర్తించిన విద్యార్థినిలకు కంటి అద్దాలు పంపిణి చేశారు. కార్యక్రమం లో జిల్లా అందత్వ నివారణ అధికారి డా. సునీత, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీమతి నర్సమ్మ, ఐఎం ఐవీసూ డా. శశికాంత్, డా.పులి విద్య, =దీూఖ కో–ఆర్డినేటర్ డా. ప్రవీణ్, =దీూఖ సిబ్బంది, ఐజు×జ సిబ్బంది పాల్గొన్నారు

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి భయమెందుకు

## రాజకీయాల కోసం చరిత్రను పక్కన పెట్టడం సిగ్గుచేటు బిజెపి రాష్ట్ర ప్రతినిధి చాడా శ్రీనివాస్ రెడ్డి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 15 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో బిజెపి రాష్ట్ర ప్రతినిధి చాడ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం రోజున విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల చరిత్రలో మరచిపోలేని రోజు నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన ఈ చారిత్రక రోజును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం తెలంగాణ చరిత్రను అవమానించడమేనని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వేలాది మంది వీరుల త్యాగాలను నాటి నేటి ప్రభుత్వాలు ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నించారు. ఓట్ల రాజకీయాల కోసం చరిత్రను పక్కన పెట్టడం సిగ్గుచేటని అన్నారు.విమోచన దినోత్సవం నిర్వహిస్తే ఎవరి మనోభావాలు దెబ్బతింటాయి?సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేందుకు ఈ ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల విముక్తి చరిత్రను అధికారికంగా గుర్తించడానికి కూడా రాజకీయ లెక్కలు




చూసుకుంటున్నారా? అని ప్రశ్నించారు.చరిత్రను దాచిపెట్టినంత మాత్రాన చరిత్ర మారదన్నారు. .తెలంగాణ ప్రజలు వాస్తవ చరిత్రను ఎప్పటికీ మర్చిపోరని అన్నారు.ఈ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించకపోతే బీజేపీ రాష్ట్రంలో అధికారంలో వచ్చాక చారిత్రక పోరాటాలను గౌరవిస్తూ అధికారికంగా సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా పండుగల నిర్వహిస్తామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ డిమాండ్లు సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి,అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించాలి, తెలంగాణ విమోచన పోరాట యోధుల కుటుంబాలను ఘనంగా సత్కరించాలి, పాఠశాలలు, కళాశాలల్లో తెలంగాణ విమోచన చరిత్రపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి,తెలంగాణ విమోచన పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ, తెలంగాణ చరిత్రను ప్రభుత్వం ఓట్ల కోసం బలిపెట్టాలని చూస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించే వరకు ప్రజల పక్షాన బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్విరాజ్, రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప, హుస్నాబాద్, అక్కనపేట, కోహెడ, చిగురుమామిడి, బెందెవరపల్లి, ఎల్కతుర్తి బిజెపి మండలాల అధ్యక్షులు బుక్యా సంపత్ నాయక్, రామంచ మహేందర్ రెడ్డి, జాలిగం రమేష్, పోలోజు సంతోష్, శ్రీరామోజు శ్రీనివాస్, మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, నాయకులు దొడ్డి శ్రీనివాస్, వెల్దండి రాజేంద్రప్రసాద్, రాయికంటి చందు, తగరపు లక్ష్మణ్, లకావత్ శారద, తోట సమ్మయ్య, జెల్ల మల్లేశం, తక్కళ్లపల్లి సంపత్ రావు,కంచర్ల శంకరయ్య, దొడ్డి శ్రీనివాస్, గొల్లపల్లి వీరా చారి, పొన్నం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాలు ఇస్తాం

## - జర్నలిస్టులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి హామీ



సిర్గాపూర్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 15 : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాల పట్టాలు అందించి, ఇల్లు నిర్మించుకునేలా ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఇండ్ల స్థలాలు రాని జర్నలిస్టులు ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమందికి ఇండ్ల స్థలాలు కేటాయించినప్పటికీ, వారికి ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంజీవరెడ్డి తెలిపారు. ఇండ్ల స్థలాల పట్టాల విషయంలో ఎవరి వద్ద నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టి, అర్హులకు స్థలం కేటాయించడంతో పాటు ఇల్లు నిర్మించుకునేలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మట్టి వినాయకుల పంపిణీ పూర్తి



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): ఆర్మూర్ పట్టణానికి చెందిన. శ్రీమన్ కొట్టూరు అశోక్. 29 సంవత్సరాలుగా సొంత డబ్బుతో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం ఇంటి వద్దనే నిమజ్జనం చేద్దాం అనే నినాదంతో పల్లెటూరి చెరువులు ప్రజలకు ఊపిరి ఆ ఊపిరిని మనం కాపాడాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, ప్రకృతిని కాపాడుకుందాం ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భావిత రాలకు పచ్చని ప్రకృతిని, అందించడం మనందరి బాధ్యత అని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 33 వేల గణపతిలను జిల్లాల వారీగా మట్టి వినాయకులను తీసుకువెళ్లి పంపిణీ చేశారు మని. అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మట్టి వినాయకులను. పూజిద్దాం అనే నినాదంతో పాఠశాలల్లో మట్టి. వినాయకులను ఉపాధ్యాయులు విద్యార్థులు తయారు చేయడం సాంస్కృతిని ఇస్తుందని పర్యా వరణాన్ని ప్రేమించే వారికి ఇది ఒక విజయ సంకేతం అని ఆయన తెలిపారు.

# ప్రభుత్వం గిరిజనుల 10 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలి

## - బీఆర్ఎస్ పార్టీ ఆదివాసి గిరిజన నాయకులు



జన్నారం, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల 10 శాతం రిజర్వే షన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని జన్నారం మండల బీఆర్ ఎస్ పార్టీ ఆదివాసీ గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రోజున మండలకేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుండి ఆదివాసీ గిరిజనులకు సరైన న్యాయం జరగడం లేదని 10 శాతం రిజర్వే షన్ ను సమర్థవంతంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతోగానో కృషి చేశారని ముఖ్యంగా తండాలు, గూడాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఘనత కేసీఆర్ కే ద క్కిందని అన్నారు. అంతేకాకుండా ఆదివాసి గిరిజ నులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడన్న విష యాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గిరిజనుల హక్కుల ను కాపాడి10 శాతం రిజర్వేష న్ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీ ఆర్ ఆదివాసి గిరిజనులకు చేసిన మేలుకు కృతజ్ఞ తగా ఈనెల 17వ తేదీన మండలకేంద్రంలోని అం బేద్కర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ ఆదివాసి గిరిజన నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్య క్షులు రాములు నాయక్, ఉప సర్పం చ్ తేజావత్ భారత్ నాయక్, బాధావత్ సాయికిరణ్, నాగవత్ రవీందర్, లకావత్ బన్సీలాల్, లౌడియ రాజు, భూ క్య శ్రీనివాస్, బాణావత్ తిరుపతి, రాథోడ్ గోపాల్, బాణావత్ లాలు, భూక్యా తిరుప తి, భూక్యా నాగే ష్, లకావత్ ప్రకాష్, బాణావత్ గణపతి తదితరు లు పాల్గొన్నారు.

# కూచనపల్లి గ్రామంలో రైతుల ఎన్నో ఏళ్ల కళ నెరవేరిన వేళ

## - 16 లక్షల నిధులచే పంపు చెక్ డాం జాలు కాలువ సెటర్ నిర్మాణం పూర్తి
## - భూగర్భ జలాలు పెరుగుతాయని హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
## - మంత్రి పొన్నం ప్రభాకర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 15 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో రైతులు ఎన్నో ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న పంపు చెక్ డాం మరియు జాలు కాలువ సెటర్ నిర్మాణం పనులు 16లక్షలతో గ్రామ సర్పంచ్ మండప పద్మ జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టగా పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుండి పంపు చెక్ డాం జాలు కాలువ సెటర్ నిర్మాణం గురించి ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నామని, ఇటీవల సర్పంచ్ మడప పద్మ జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు మంత్రి పొన్నం ప్రభాకర్ ని విజ్ఞప్తిగా వెంటనే స్పందించిన మంత్రి 16 లక్షల నిధులు మంజూరుచేశారని, పంపు జాలుకాలువ సెటర్ పనులు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారని,పనులు పూర్తయ్యాయని రైతులు తెలిపారు. దీంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంపు చెక్ డాం జాలు కాలువ సెటర్ నిండి పారుతుందన్నారు. దీంతో భూగర్భ జలాలు పెరిగడంతో పాటు బావులలో నీరు వస్తాయని చుట్టుపక్కల వ్యవసాయం వృద్ధిలోకి వస్తుందని, పశువులకు త్రాగునీటి దొరుకుతుందని హర్షం వ్యక్తం చేశారు. కుచనపల్లి గ్రామ రైతుల సమస్యను గుర్తించి ఆలస్యమైనప్పటికీ త్వరితగతిన పనిని పూర్తి చేయించి చుట్టుపక్కల ఉన్న రైతులకు బోర్లకు బావులకు ఎంతో ఉపయోగకరంగా మార్చినందుకు, పనులు వెంటనే చేయించినందుకు కుచనపల్లి గ్రామ రైతులు సర్పంచ్ మడప పద్మ, జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్నరాజు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి రాజు,అధ్యక్షుడు కూరెళ్ళ సంతోష్, ఉపాధ్యక్షుడు రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి బండి రాజు, గౌరవ అధ్యక్షులు స్వామి,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు వార్డు సభ్యులు రైతులు అందరూ హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ కి గ్రామస్తుల తరఫున రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

తానూర్ : సెప్టెంబర్ 15 : విజన్ ఆంధ్ర : తానూర్ :మండలం భోసి గ్రామంలో కొలువైన శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుడిని ముధోల్ శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ పవార్ రామారావు పటేల్ మంగళవారం మధ్యాహ్నం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో పాటు భైంసా మున్సిపల్ చైర్మన్ శ్రీ తూము దత్తాత్రి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుడిని దర్శించుకున్నారు. భోసి గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, మున్సిపల్ చైర్మన్ తూము దత్తాత్రి, ఇతర ప్రజాప్రతినిధులకు గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీ ఉత్తమ్ బాలేరావు, భోసి గ్రామ సర్పంచ్ శ్రీమతి పసుల సాగరబాయి నాగనాథ్, విడిసి చైర్మన్ శ్రీ రోగల్ బాలాజీ, ఉప సర్పంచ్ శ్రీ సల్ల లక్ష్మణ్‌తో పాటు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

**భక్తులకు అన్నదానం....**

శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుడి ఉత్సవాలను పురస్కరించుకుని అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టే పురం మోహన్ రెడ్డి, సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నదాన



కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాల సందర్భంగా భోసి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుండగా, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు తాటివార్ రమేష్ మోహన్. ఎడ్ బీడ్ మాజీ సర్పంచ్ దత్తాత్రిమరియు భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్.. పచ్చిపులుసు వడ్డింపు !

## - చిన్న కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో మెనూపై నిర్లక్ష్యం?



కుకునూరుపల్లి, సెప్టెంబర్ 15,విజన్ ఆంధ్ర : విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పచ్చిపులుసు చేయొద్దని జిల్లా కలెక్టర్ హైమావతి జిల్లాలోని పాఠశాలల సందర్శనలకు వెళ్లినప్పుడు పలుమార్లు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ, మండల పరిధిలోని చిన్న కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనంలో పిల్లలకు పచ్చిపులుసు వడ్డించడం గమనార్హం. మెనూ ప్రకారం మంగళవారం అన్నం, మిక్సిడ్ వెజిటేబుల్ కర్రీ, పప్పు చారు పెట్టాలి.. కానీ పచ్చిపులుసు పెట్టి ఉపాధ్యాయులు మమ అనిపించడమే కాకుండా ఇదేంటి ని ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలిని విజన్ ఆంధ్ర విలేకరి అడగగా, సొరకాయ కూరలో టమాటలు ఉన్నాయి కదా అని సమాధానం చెప్పడం మరింత ఆశ్చర్యకర అంశం. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది.

### వ్యవసాయ కరెంటు షాక్ కుమారస్వామి..

# కుటుంబంలో విషాదం



పరకాల విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 15: వ్యవసాయ పొలంలో మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లిన ఓ పాలేరు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన పరకాల మండలంలో చోటుచేసుకుంది. మలక్‌పేట గ్రామానికి చెందిన రాసమల్ల కుమారస్వామి (45) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మలక్‌పేట హనుమాన్ దేవాలయం సమీపంలోని వ్యవసాయ పొలంలో జరిగింది.

గ్రామస్తుల వివరాల ప్రకారం..

మలక్‌పేటకు చెందిన కుమారస్వామి మాదారం శివారు ప్రాంతానికి చెందిన రైతు పిట్ట సమ్మయ్య వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. రోజువారీ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం పొలానికి వెళ్లాడు. వ్యవసాయ మోటార్‌ను ఆన్ చేసే క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు తెలిపారు.

కుమారస్వామికి విద్యుదాఘాతం తగిలిన విషయాన్ని రైతు పిట్ట సమ్మయ్య భార్య గ్రామస్తులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. అప్పటికే కుమారస్వామి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. నిరుపేద రజక కుటుంబానికి చెందిన కుమారస్వామి మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, వైర్లు, విద్యుత్ పరికరాల వద్ద భద్రతా ప్రమాణాలను పటిష్టంగా అమలు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు

## - హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై మరియు ఆయన రచించిన రాజ్యాంగంపై వివాదాస్పద అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ వైఖరిని నిరసిస్తూ ఆలూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మాల మహానాడు మండల అధ్యక్షులు అగ్గు క్రాంతి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశమంతట ఎంతోమందికి మార్గదర్శిగా నిలిచిన బాబా సాహెబ్ అంబేద్కర్ ను రాజ్యాంగాన్ని అవమానించేలా మాట్లాడడం అత్యంత హేయమైన చర్యాని మండిపడ్డారు. హమారా ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను అంబేద్కర్ సంఘాలు మాల మహానాడు నాయకులు మరియు యువజన సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. హమారా ప్రసాద్ తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు లేని పక్షంలో నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బహుజన నాయకులను రాజ్యాంగాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే దేశంలో ఎక్కడ తిరగనివ్వమని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు అంబేద్కర్ సంఘాల నాయకులు మాల మహానాడు ప్రతినిధులు మరియు యువజన నాయకులు పాల్గొని హమారా ప్రసాద్ కి వ్యతిరేకంగా నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హర్ష హరీష్, అయితే వెంకటేష్, సజన్, ప్రదీప్, వినయ్, భోజన్న, ప్రణయ్, మల్లేష్, సురేష్, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

# వరసిద్ధి కర్ర వినాయకుని సన్నిధిలో సంగీత విభావరి



తానూర్ : సెప్టెంబర్ 15 : విజన్ ఆంధ్ర : భోసి గ్రామంలోని శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుని సన్నిధిలో రసరంజని సంగీత విద్యాలయం–బైంసా ఆధ్వర్యంలో సంగీత విభావరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తి, సంగీతంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారింది.శ్రీ పురస్తు గోపాల కిషన్ వారి సుపుత్రులు శ్రీ పురస్ రాహుల్ ఆధ్వర్యంలో ఈ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. రసరంజని సంగీత విద్యాలయానికి చెందిన కళాకారులు భక్తి గీతాలు, ఆధ్యాత్మిక గీతాలను ఆలపించి భక్తులను అలరించారు. సంగీత స్వరాలతో వినాయకుని సన్నిధి మార్మోగగా, కార్యక్రమానికి హాజరైన భక్తులు సంగీతాన్ని ఆస్వాదించారు.

శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుని సన్నిధిలో ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తుల్లో భక్తిభావంతో పాటు కళల పట్ల ఆసక్తి పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా సాగింది.

## దుబ్బాకలో ఘనంగా ప్రారంభమైన సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు

దుబ్బాక విజన్ ఆంధ్ర దుబ్బాక పట్టణంలో కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ సెట్టింగులతో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.



# రబింద్ర పాఠశాలలో ఘనంగా హిందీ దివస్ వేడుకలు

## - విద్యార్థుల కవితలు, చిత్రలేఖనం, ప్రసంగాలు, హిందీ పాటలతో సందడి

ముధోల్ : సెప్టెంబర్ 15 : విజన్ ఆంధ్ర : ముధోల్ మండల కేంద్రంలోని రబింద్ర పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హిందీ భాష గొప్పతనం, ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వారిలో భాషపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో పలు సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ కవితలు, చిత్రలేఖనం, ప్రసంగాలు, హిందీ పాటల కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయినాథ్ మాట్లాడుతూ భారతదేశంలో హిందీ భాషకు విశిష్టమైన స్థానం ఉందని తెలిపారు. దేశంలోని ప్రజలను భాషావరంగా అనుసంధానించడంలో హిందీ భాష కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థులు హిందీ




భాష గొప్పతనాన్ని, ప్రాధాన్యతను తెలుసుకొని భాషపై మరింత ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. చదువుతో పాటు భాష, సాహిత్యం, కళలు, సాంస్కృతిక అంశాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని పేర్కొన్నారు.

హిందీ దివస్‌ను పురస్కరించుకొని నిర్వహించిన కవితా పఠనం, చిత్రలేఖనం, ప్రసంగాలు, హిందీ పాటల కార్యక్రమాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో భాషలపై ఆసక్తితో పాటు సృజనాత్మక ఆలోచనా శక్తి పెంపొందుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు మురళి, సాహెబ్ రావు, దీపాలి, పద్మ, మనీషా, పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్. ఉపాధ్యాయుల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుని జన్మదిన వేడుకలు

జన్నారం, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : బీఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బాలసాని శ్రీనివాస్ గౌడ్
జన్మదిన వేడుకలను పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జన్నారం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున పొనకల్ పట్టణ అధ్యక్షులు బాలసాని శ్రీనివాస్ గౌ డ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు బాలసా ని శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ మండల అధ్యక్షులు గుర్రం రాజారాం రెడ్డి, సీనియర్ నాయకులు మున్వర్ అలీ, చిటిమల్ల భ రత్ కుమార్, జాడి గంగాధర్, సుతారి వినయ్ కు మార్, వొళ్ళలా నర్సగౌడ్, దాసరి శ్రీనివాస్, బోర్లా కుంట్ల ప్రభుదాస్, జంగం సంతోష్, బండెల ప్రేమ్ సాగర్, కొండపల్లి మహేష్, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, దు మల్ల ఎల్లయ్య, కొండూకూరి ప్రభుదాస్, అయిలవే ణి రవి, భూతం శ్రీనివాస్, బిట్టి లక్ష్మణ్, ఆంధ్ర పురు షోత్తం, కూడల శ్రీధర్ రావు, జునుగురు మల్లేష్ త దితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
### విద్యారంగంలో సేవలందించిన గురువులకు గౌరవం
### నేడు ఐడిపిఎల్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించేందుకు కుత్బుల్లాపూర్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. విద్యారంగంలో విశేష సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించనున్నారు. ఐడిపిఎల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలోని హోటల్ జెయ్స్ ఇన్ బ్యాంకెట్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. పలువురు విద్యావేత్తలు, విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై సన్మాన గ్రహీతలను అభినందించనున్నారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని ఉ పాధ్యాయులు, విద్యార్థులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి జెమిని కుమారి కోరారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సత్కరించడం ద్వారా గురువుల పట్ల విద్యార్థుల్లో మరింత గౌరవభావం పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఉట్నూర్ ఐటీడీఏలో నేడు ఆదివాసీ మార్చ్, ముట్టడి

### -ఆదివాసీ హక్కులు, అస్తిత్వం, భూమి ఉద్యోగ సమస్యల పరిష్కారమే ప్రధాన డిమాండ్లు

ఉట్నూర్, సెప్టెంబర్ 15, (విజన్ ఆంధ్ర) : ఆదివాసీ హక్కులు, అస్తిత్వం, భవిష్యత్తు పరిరక్షణతో పాటు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నేడు ఆదివాసీ మార్చ్--ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, పూర్వ బాపూరావు, పెందోర్ దాదిరావు పిలుపునిచ్చారు.
ఆదివాసీలకు సంబంధించిన ఎస్టీ రిజర్వేషన్లు, ఐదో షెడ్యూల్ అమలు, ఐటీడీఏ ద్వారా పరిపాలన, ఉద్యోగాలు, పోడు భూములకు పట్టాలు, 1/70 చట్టం పరిరక్షణ తదితర అంశాలను ప్రధాన డిమాండ్లుగా నాయకులు ప్రభుత్వం ముందుంచనున్నారు.

ప్రధాన డిమాండ్లు

1976--2026 మధ్య ఎస్టీ రిజర్వేషన్లపై వచ్చిన ఆరోపణలపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్. ఆర్టికల్ 342 ప్రకారం ఎస్టీ జాబితాలో అర్హతపై సమీక్ష చేపట్టాలని కోరుతున్నారు.
-ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో జీవో 57 ప్రకారం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ విధానాన్ని ఐటీడీఏల ద్వారా అమలు చేయాలి.
గతంలో ఉన్న 29 శాఖల వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్.
- ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాల భర్తీ, ప్రమోషన్లు, బదిలీలను ఐటీడీఏల పరిధిలో నిర్వహించాలని కోరుతున్నారు.



ౖ ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల వేధింపులు, దాడులను నిలిపివేసి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్.
-1/70 చట్టాన్ని పరిరక్షించి, దాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.
-ఏజెన్సీ ప్రాంతాల్లో డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ తదితర ఉద్యోగాల్లో 75 శాతం అవకాశాలను ఏజెన్సీ అభ్యర్థులకు కల్పించాలని డిమాండ్.
ఆదివాసీ మార్చ్‌లో ఆదివాసీ సమాజ పెద్దలు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు ప్రతి గ్రామం, గూడెం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆదివాసీ విద్యార్థి సంఘం, ఆదివాసీ మహిళా సంఘం, ఆదివాసీ ఉద్యోగుల సంఘం, ఆదివాసీ కళ సమితి కోరారు. "మన హక్కుల కోసం.. మన అస్తిత్వం కోసం.. మన భవిష్యత్తు కోసం.. చలో ఉట్నూర్ ఐటీడీఏ" అంటూ నాయకులు పిలుపునిచ్చారు.

# సహజ సాగుతో నేల ఆరోగ్యం..డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజా నరేందర్

బెల్లంపల్లి సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర సహజ వ్యవసాయంతో నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి అధిక లాభాలు పొందవచ్చని బెల్లంపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజా నరేందర్ అన్నారు. కన్నాల రైతు వేదికలో జాతీయ సహజ వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి, తాండూర్ మండలం గోపాల్‌నగర్‌కు చెందిన ఎంపికైన రైతులు పాల్గొన్నారు.
సేంద్రియ ఎరువుల వినియోగం, సస్యరక్షణ, నీటి యాజమాన్యం, సహజ వనరుల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులకు దూరంగా సహజ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రాజా నరేందర్ సూచించారు. ప్రతి శుక్రవారం చంద్రవెల్లిలో సహజ వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నట్లు బెల్లంపల్లి ఏవో సుద్దాల ప్రేమ్‌కుమార్



తెలిపారు. ఘనజీవామృతం, వివిధ కషాయాల తయారీ విధానాలను తాండూర్ ఏవో సుష్మ వివరించారు.
ఈ కార్యక్రమంలో అధికారులు సీహెచ్. తిరుపతి, గౌస్య బేగం, కె. రాకేష్, ఉద్యానవన అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి

### - ఎమ్మెల్యే వినోద్ తీరుపై సీనియర్ల అసంతృప్తి

బెల్లంపల్లి, సెప్టెంబరు 15 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి బహిర్గతమైంది. పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు మత్తమరి సూరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు సీనియర్ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను విస్మరిస్తున్నారని నాయకులు ఆరోపించారు. పార్టీకి మొదటి నుంచి అండగా ఉన్న వారిని పక్కనపెట్టి వలస వచ్చిన నాయకులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఇదే విధానం కొనసాగితే బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీని బలోపేతం చేయాలంటే సీనియర్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఎమ్మెల్యే ముందుకు సాగాలని సూచించారు. ప్రజా సమస్యలపై అందరినీ కలుపుకొని పనిచేయడంతోపాటు పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్లు, కార్యకర్తలను విస్మరిస్తే పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి అధికారంలోకి తీసుకురావాలంటే నాయకత్వం అందరినీ కలుపుకొని పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. తమ సూచనలను ఎమ్మెల్యే పరిగణనలోకి తీసుకోకపోతే పార్టీ అధిష్ఠానాన్ని ఆశ్రయించి పరిస్థితిని వివరిస్తామని, అవసరమైతే ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తామని సీనియర్ నాయకులు హెచ్చరించారు.
ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అబ్జల్, మునిమంద రమేష్, నయుం , రొడ్డ శ్యామ్, ఎండీ గౌస్, జక్కుల శ్రీధర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిప్ప మనోహర్, మాజీ కౌన్సిలర్ బొడ్డు నారాయణ, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీష్, సిలివేరి సత్యనారాయణ, సూరం బానేష్, మేకల శ్రీనివాస్, మత్తమరి సత్తిబాబు,



మంగమూర్తి, దాసరి సంజీవ్, మత్తమరి జగన్, బైరి శ్రీనివాస్, మత్తమరి శ్రీనివాస్, రాజబ్రహ్మం, గడ్డం అశోక్, కళ్యాణం పోషం, అజీమ్ భాయ్, ఎండీ రహీం, హరీష్ పాండే, బబ్లు భాయ్, ఆర్ఎం సింగ్, నక్క కృష్ణ, రాజారత్నం, చిన్న జీలకర్ర వాసు, సబ్బని రాజనర్సు, టీఎల్ చారి, జంజిరాల మనోహర్, కుమ్మరి శంకర్, జూపాక లక్ష్మీనారాయణ, మల్లేష్, బాబూరావు, సోగాల రవి, అంజయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య బెల్లంపల్లి డివిజన్ ఎన్నికల కన్వీనర్‌గా రేణికుంట్ల శ్రీనివాస్

బెల్లంపల్లి సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి డివిజన్‌లోని పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘాల ఎన్నికల నిర్వహణకు మాజీ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్ ను డివిజన్ ఎన్నికల కన్వీనర్‌గా నియమించారు. మంచిర్యాలలో జరిగిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. నెల రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు సభ్యత్వాన్ని పెంచేందుకు కృషి చేయాలని కమిటీకి సూచించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శి ముక్తా శ్రీనివాస్, ప్రత్యేక సలహాదారు నలుమాసు కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మైలారంలో ఉచిత వైద్య శిబిరం



బెల్లంపల్లి సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : నెన్నల్ మండలంలోని మైలారం గ్రామపంచాయతీలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ డాక్టర్స్ సెల్--మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ చందన సుధాకర్, ఆర్గనైజర్ పి. మహేష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మైలారం గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాచారంలో వైభవంగా గిరి ప్రదక్షిణ

గజ్వేల్ నియోజకవర్గం, 15 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) :సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలం పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, నాచారం గుట్ట నందు శ్రీ స్వామివారి జన్మనక్షత్రమైన "స్వాతి" సందర్భంగా మంగళవారం ఉదయం 7.30 గంటలకు గిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి. రంగాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఆలయ అర్చక స్వాముల వేద మంత్రోచ్చారణల మధ్య అశేష భక్త జనం పాలుపంచుకున్నారు. భక్తులంతా "నారసింహ" నామస్మరణతో గిరి ప్రదక్షిణ చేయడం తో నాచారం గుట్ట పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయాయి. స్వాతి నక్షత్ర విశేష సమయాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్, మాజీ ధర్మకర్తలు, గాలి కిష్టయ్య, కర్రె పద్మా వెంకటేష్, కొత్తపల్లి శ్రీనివాస్, అర్చకులు, సహాయకులు సుధాకర్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రాజ్యాంగం కల్పిత కథ కాదు. ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం

**- క్రిస్టియన్ డెమొక్రటిక్ ఫోరం (సీడీఎఫ్)**




జన్నారం, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర) : రాజ్యాం గం కల్పిత కథ కాదు ప్రజాస్వామ్యానికి ప్రాణధారం అని క్రిస్టియన్ డెమొక్రటిక్ ఫోరమ్ తెలిపింది. హ మారా ప్రసాద్ రచించిన "రాజ్యాంగం ఒక కల్పిత కథ" అనే పుస్తకాన్ని ఈ నెల 18న ఆవిష్కరించను న్న నేపథ్యంలో మంగళవారంరోజున జన్నారంమం డలకేంద్రంలో క్రిస్టియన్ డెమొక్రటిక్ ఫోరం (సీడీ ఎఫ్) ఆవిష్కరణపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిం ది.ఈ సందర్భంగా సీడీఎఫ్ రాష్ట్ర ఫైనాన్స్ కమ్ ఆ ర్గనైజింగ్ సెక్రెటరీ పాస్టర్ షాలేమ్ రాజు మాట్లాడు తూ భారత రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాద ని, దేశంలోని ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, మత స్వాతంత్ర్యం, ప్రాథమిక హక్కులు కల్పించే అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థ అని పేర్కొ న్నారు. రాజ్యాంగాన్ని కించపరిచేలా లేదా ప్రజల్లో అపోహలు కలిగించేలా ప్రచారం చేయడం ప్రజా స్వామ్య విలువలకు విరుద్ధమని, ఇలాంటి కార్యక్ర మాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నిస్తామని అ న్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 ద్వారా కల్పించిన మత స్వేచ్ఛ మరియు మత సంస్థల హక్కులను క్రైస్తవ సమాజం ఎంతో గౌరవిస్తుందని, దేశంలోని అన్ని మతాలు, వర్గాలు, భాషలకు సమాన హక్కు లు కల్పించే రాజ్యాంగ పరిరక్షణను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలం లోని పలు వురు చర్చిల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాన్ని దర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

గజ్వేల్, 15 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో భీమా యూత్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, స్థానిక కౌన్సిలర్ మర్కంటి భాగ్యలక్ష్మి కనక సేన తో కలిసి మంగళవారం ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ భీమా యూత్ సభ్యులు ప్రతి ఏటా ఎంతో ఉత్సాహంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఐక్యతతో, సంతోషంగా భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేదా సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మున్సిపాలిటీ తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమా యూత్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 15: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

రామోజీపల్లి, విరోజీపల్లి, కొత్తపేట, జుక్కల్, సంగారెడ్డి పేట, నారాయణపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అలాగే శంకరంపేట మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా, సులభంగా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. శంకరంపేట మండలంలో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.

పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల దిగుబడికి నానో యూరియా దోహదం

**:ఏడిఏ బాబు నాయక్**

**- రైతులు ఆధునిక సాగు పద్ధతులు అందిపుచ్చుకోవాలి :సర్పంచ్ మధు**



కుకునూరుపల్లి, సెప్టెంబర్ 15,విజన్ ఆంధ్ర : రైతులు నానో యూరియా వినియోగంపై పూర్తి అవగాహనా కల్గి ఉండాలని గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మెదినీపూర్ గ్రామంలో రైతులకు నానో యూరియా వాడకం పట్ల అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడిఏ మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ, నానో యూరియాను వినియోగిస్తే సాగు ఖర్చులను నియంత్రణ చేసుకోవచ్చన్నారు. మెదినీపూర్ సర్పంచ్ మధు మోహన్ మాట్లాడుతూ నానో యూరియా వంటి ఆధునిక ఎరువుల వినియోగంపై అధికారులు కల్పిస్తున్న అవగాహనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గోవింద రాజు, ఏఈఓ రమ్య శ్రీ, ఎంపీఓ నాగభూషణం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పూర్‌లో ఘనంగా గణనాథుని పూజలు

చౌటకూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మహేష్ యాదవ్ దంపతులు గణనాథుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో గణపతి బప్పా మోరియా అంటూ గణనాథునికి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుడిని దర్శించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ...

బెల్లంపల్లి సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకం కింద కాసిపేట మండలం ధర్మారావుపేటలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్య పరిరక్షణ, సాగు ఖర్చుల తగ్గింపు, స్థానిక వనరుల వినియోగంపై అవగాహన కల్పించారు. జీవామృతం, బీజామృతం, ఘన జీవామృతం, మల్చింగ్, అంతర పంటలు, పంట మార్పిడి విధానాలను వివరించారు. అనంతరం ఎంపికైన రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. కిట్లను సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఈ.సురేఖ, సర్పంచ్ జుగునాక రాధ, ఏఎంసీ చైర్మన్ రత్నం సుకుమారి, పీఏసీఎస్ చైర్మన్ తాటిపాముల శంకర్‌గౌడ్, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# గృహాల సేకరణకు కృషి చేసి పరిహారం ఇప్పించాలి

**- తాడిచర్ల భూనిర్వాసితుల సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి**



మల్హర్, సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచర్లలోని రెవెన్యూ, పీహెచ్‌సీ సమీక్షకు వచ్చిన కాటారం సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మను మంగళవారం తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు, భూనిర్వాసితుల కమిటీ ఉపాధ్యక్షుడు బండి రాజయ్య ఆధ్వర్యంలో నాయకులు కలిసి భూనిర్వాసితుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. తాడిచర్లలోని టిజి జెన్కో ఓసిపి కి 500 మీటర్ల డేంజర్ జోన్ లో నివాస గృహాల ప్రజలు దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఓసీపీ బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయని వారు తెలిపారు. డేంజర్ జోన్ పరిధిలో ఉన్న గృహాలను సర్వే పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే పరిహారం అందించాలని కోరారు. డేంజర్ జోన్‌లో ఉన్న కుటుంబాలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే ఇళ్ల సర్వేలో తలెత్తిన సమస్యలను పరిశీలించి అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భూనిర్వాసితుల సమస్యలపై సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితుల కమిటీ సభ్యులు అశోక్ రావు, కేసరపు చంద్రయ్య, రామిడి గట్టయ్య, అర్ని సత్యనారాయణ, అజ్మత్ అలీ, బూడిది రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ సంక్షేమ ఫలాలు !

**- జామ్డలో ఇందిరమ్మ ఇళ్లు.. పంచాయతీ భవనం ప్రారంభం**

**- బాలన్‌పూర్‌లోనూ కొత్త పంచాయతీ భవనం ప్రారంభం**

నార్నూర్, సెప్టెంబర్ 15( విజన్ ఆంధ్ర ):అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. నార్నూర్ మండలం జామ్డ, బాలన్‌పూర్ గ్రామాల్లో మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

ఇళ్లకు భూమిపూజ.. పట్టాల పంపిణీ

జామ్డలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. మరో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు భూమి పట్టాలను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రజలకు పాలన మరింత చేరువ

బాలన్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే కోవా లక్ష్మి ప్రారంభించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని తెలిపారు. నూతన పంచాయతీ భవనాలతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ శంకర్,డీఈ షకీర్,ఏఈ రాకేష్,తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో పుల్లారావు,సర్పంచులు చంద్రకాంత్,ఆత్రం సంగీత,కనక సత్యం,అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇంజినీర్స్ డే వేడుకలు

**- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ**



గజ్వేల్, 15 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : ఇంజినీర్స్ డే పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ ఇంజినీర్స్ డే సందర్భంగా సమాజానికి ఉపయోగపడేలా ఇటువంటి సేవ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వృత్తిధర్మం బాధ్యతలతో పాటు సామాజిక దృక్పథం తో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను అసోసియేషన్ తరపున భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ సురేష్, కార్యదర్శి మహమ్మద్ ఉవేస్, సభ్యులు నరేష్, శ్రీకాంత్, బాలాజీ, సుమంత్, రాజశేఖర్ రెడ్డి, వినీత్, లింగ శ్రీకాంత్, సంజయ్, మురళి, నివేశ్, తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడల్లో రత్నాపూర్ హైస్కూల్ విద్యార్థుల సత్తా

శివంపేట్, సెప?టంబర్15 (విజన్ ఆంధ్ర): మెదక్ జిల్లా శివంపేట్ మండల స్థాయి ఆటల పోటీల్లో రత్నాపూర్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించారు. బాలుర కబడ్డీ, వాలీబాల్‌తో పాటు జూనియర్స్ కబడ్డీలోనూ రత్నాపూర్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే బాలికల కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లోనూ ప్రథమ బహుమతులు సాధించి పాఠశాలకు ఘనత తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఘన విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, అలాగే క్రీడలకు శిక్షణ అందించిన పీఈటీ మేడంను రత్నాపూర్ సర్పంచ్ కండేగారి ఆంజనేయులు, ఉప సర్పంచ్ అల్లం నరసింహులు, వార్డు మెంబర్ నవీన్ కుమార్ అభినందించారు. అనంతరం విద్యార్థులను, పీఈటీ మేడంను శాలువాలతో సన్మానించి వారి ప్రతిభను కొనియాడారు. పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో పలు క్రీడా విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించడం పట్ల గ్రామస్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# వినాయక మండపాలకు ఉచిత తాగునీరు!

- అన్నదానాలకు వాటర్ ట్యాంకర్ల సౌకర్యం
- మండపాల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలి
- డివిజన్ కన్వీనర్లకు వివరాలు అందజేయాలి



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలకు అవసరమైన తాగునీరు, ఇతర నీటి అవసరాల కోసం ఉచితంగా వాటర్ ట్యాంకర్లను అందించేందుకు వాటర్ వర్క్స్ అధికారులు సిద్ధంగా ఉన్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ తెలిపారు. సమితి విజ్ఞప్తి మేరకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే వినాయక మండపాలకు ఉచిత నీటి సౌకర్యం కల్పించేందుకు అధికారులు ముందుకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. నిజమైన మండపాల నిర్వాహకులు ఈ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాటర్ ట్యాంకర్ అవసరమున్న మండపాల నిర్వాహకులు మండపం పేరు, డివిజన్ పేరు, అన్నదానం నిర్వహించే తేదీ, అవసరమైన సమయం, సంప్రదించాల్సిన వ్యక్తి పేరు, ఫోన్ నంబర్ తదితర వివరాలను తమ డివిజన్ కన్వీనర్ లేదా కో-కన్వీనర్‌కు అందజేయాలని సూచించారు. అందిన వివరాలను సమగ్రంగా సేకరించి కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం, నిజాంపేట్ వాటర్ వర్క్స్ జీఎంలకు పంపిస్తామని ఆకుల సతీష్ తెలిపారు. అవసరమున్న మండపాలకు ఉచిత వాటర్ ట్యాంకర్లు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని చెప్పారు. అలాగే బీజీయూఎస్ డివిజన్ కమిటీ సభ్యులు ఈ సమాచారాన్ని తమ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులకు చేరేలా సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆకుల సతీష్ కోరారు.





# తాడిచర్ల పీహెచ్‌సీని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ

- వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయకుండా చూడాలని సూచన

మల్హర్, సెప్టెంబర్ 15 విజన్ ఆంధ్ర : తాడిచర్ల: కాటారం సబ్ కలెక్టర్ శ్రీ సౌరబ్ శర్మ ఈరోజు తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను, వైద్య సేవలను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు, ముఖ్యంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తాడిచర్ల తహశీల్దార్ కార్యాలయాన్ని కూడా సందర్శించిన సబ్ కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కే. రవికుమార్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలి

- తహసీల్దార్‌కు శివంపేట యువకుల ఫిర్యాదు



చౌటకూర్ సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర):- మండల పరిధిలోని శివంపేట గ్రామ శివారులో రాత్రి వేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తూ పట్టుబడిన టిప్పర్, ఎక్స్‌కవేటర్‌పై కేసు నమోదు చేసి, వెంటనే సీజ్ చేయాలని గ్రామానికి చెందిన యువకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, ఎంపీపీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అలీం ఆధ్వర్యంలో పలువురు యువకులు, రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లారు. రాత్రి వేళల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, మొరం తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ అనుదీప్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 11వ తేదీ రాత్రి పట్టుబడిన వాహనాలతో పాటు వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఆనుకుని ఉన్న స్థలంలో భారీ గుంతలు తవ్వి మట్టిని తరలించడంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గుంతలు నీటితో నిండిపోయాయని, విద్యార్థులెవరైనా ప్రమాదవశాత్తు అందులో పడితే ప్రాణాపాయం జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, పట్టుబడిన వాహనాలను ఇప్పటికే పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినప్పటికీ, రెవెన్యూ అధికారులు ఎలాంటి కేసు నమోదు చేయకుండా కేవలం తాళాలు మాత్రమే పోలీసులకు అప్పగించి వచ్చారని బాధితులు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో సాగుతున్న అక్రమ మట్టి వ్యాపారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను వదిలిపెట్టవద్దని, వాటి ధ్రువపత్రాలను పరిశీలించి కోర్టులో డిపాజిట్ చేయాలని పట్టుబట్టారు. కేసు నమోదు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కఠిన చర్యలు తీసుకుంటాం: ఇన్‌ఛార్జ్ తహసీల్దార్

ఈ విషయమై ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ అనుదీప్ స్పందిస్తూ.. అక్రమ రవాణాపై చట్టపరంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా ఎవరైనా మట్టి, మొరం తరలిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్రమ వ్యాపారానికి పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ద్వారకా వెంచర్‌లో వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు ఎన్.సి. సంతోష్



గజ్వేల్, 15 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘం పరిధిలోని 15వ వార్డు ఎన్.సి.ఆర్. ద్వారకా వెంచర్‌లో, కీర్తిశేషులు ఎన్ సి రాజయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గణపతి మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కాలనీ వాసులందరూ కలిసి పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ ఉత్సవాల్లో బిఆర్ఎస్ నాయకులు ఎన్.సి. సంతోష్ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.సి. సంతోష్ మాట్లాడుతూ కాలనీవాసులంతా ఒక్కటై ఎన్.సి.ఆర్ ద్వారకా వెంచర్‌లో భక్తిశ్రద్ధలతో మట్టి గణపతిని ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని, ఈ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి, కాలనీ నివాసులకు ఆ గణనాథుడి ఆశీస్సులు, కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్



గజ్వేల్, 15 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పురపాలక పరిధిలోని 13వ వార్డు భారత్ నగర్ గల్లీలో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్, స్థానిక కౌన్సిలర్ భాగ్యలక్ష్మి కనకసేన మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వార్డుల్లో సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, రోడ్డు నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని భారత్ నగర్ ప్రజలకు చాలాకాలంగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కారం కానుందని సంతోషం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కౌన్సిలర్ భాగ్యలక్ష్మి కనక సేన మాట్లాడుతూ 13వ వార్డు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న పురపాలక పాలకమండలి, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎమ్మార్వోను కలిసిన గ్రామస్తులు

- శివంపేట, తర్దనపల్లి శివార్లలో అక్రమ మట్టి తవ్వకాలు?
- అధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితమా..
రాత్రివేళల్లో టిప్పర్లతో మట్టి తరలింపు
- మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల తీరుపై స్థానికుల ఆగ్రహం

చౌటకూర్, సెప్టెంబర్ 15 (విజన్ ఆంధ్ర): సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట, తర్దనపల్లి గ్రామాల శివార్లలో అక్రమంగా మట్టి, మొరం తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ విషయంపై గ్రామస్తులు ఎమ్మార్వో అనుదీప్‌ను కలిసి తమ సమస్యలను వివరించి, అక్రమ తవ్వకాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికుల ఆరోపణల ప్రకారం.. శివంపేట, తర్దనపల్లి గ్రామాల శివార్లలో అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా మట్టి, మొరం తవ్వకాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. తవ్వకాల కారణంగా పలు ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడుతున్నాయని, ప్రభుత్వ భూములకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రివేళల్లో టిప్పర్లతో మట్టి తరలింపు

రాత్రి వేళల్లో టిప్పర్లు, ఇతర భారీ వాహనాల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తవ్వకాలకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? లేక అక్రమంగా మట్టి తరలింపు జరుగుతోందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తమ ఫిర్యాదులను అధికారులు పట్టించుకోకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ఆదేశాలు అమలయ్యేది ఎప్పుడు?

అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. అధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితమవుతున్నాయా? అని ప్రశ్నిస్తున్నారు.

అక్రమ తవ్వకాలపై సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా?

ఒక్కో టిప్పర్‌కు మట్టి తరలింపునకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. రోజూ పెద్ద సంఖ్యలో వాహనాల ద్వారా మట్టి తరలింపు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిగితే ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతకు కూడా ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు.

పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో తవ్వకాలపై ఆందోళన

శివంపేట, తర్దనపల్లి శివార్లలోని పాలిటెక్నిక్ కళాశాల సమీప ప్రాంతాల్లో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతాలకు సమీపంలో భారీ గుంతలు ఏర్పడితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజా ఆస్తుల పరిరక్షణ అవసరం

ఈ వ్యవహారంపై స్థానిక రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపైనే ఉందని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. రాజకీయ విభేదాలకు అతీతంగా అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమగ్ర విచారణకు గ్రామస్తుల డిమాండ్ శివంపేట, తర్దనపల్లి గ్రామాల శివార్లలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మట్టి, మొరం తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించి, అనుమతుల వివరాలను వెల్లడించాలని, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలోనే ఇలాంటి ఆరోపణలు వెలుగులోకి రావడం పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.



## కల్దుర్కిలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం... ?

బోధన్, సెప్టెంబర్15 (విజన్ ఆంధ్ర) : బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మన అంగన్వాడీ-మన బాధ్యత అనే ప్రధాన థీమ్‌తో ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.

?ఈ సందర్భంగా మహిళలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం యొక్క ప్రాధాన్యతపై ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ సిబ్బంది విస్తృత అవగాహన కల్పించారు. సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అనంతరం గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరేందర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ గోపిలక్ష్మి, గ్రామ కార్యదర్శి షైనాజ్ బేగం, అంగన్వాడీ టీచర్లు వత్సల, సాయమ్మ, క్రాంతి, సునంద, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, తల్లులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ దాడులు

- ఇద్దరి అరెస్టు.. • 6 లీటర్ల గుడుంబా స్వాధీనం

కిస్తునాయక్ తండా, అక్కపల్లి తండాల్లో తనిఖీలు చేపట్టారు. ఆల్మాస్‌పూర్ తండాలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న రెండు కేసులను నమోదు చేసిన అధికారులు, ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 6 లీటర్ల అక్రమ గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తయారీకి సిద్ధంగా ఉన్న 100 లీటర్ల బెల్లం పులుపు (ఫీజ్ వాష్)ను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ రెండ్ల, హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కరుణాకర్, వర్మ, ప్రేమలత పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టు కాలువలు వెంటనే పూర్తి చేయాలి

మహ్మదాపూర్ గుట్టలను పర్యాటక కేంద్రంగా, అనభేరి విగ్రహాన్ని హుస్నాబాద్ లో ఏర్పాటు చేయాలి

సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 15 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ లో సిపిఐ ఆధ్వర్యంలో 78వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరయ్యారు. హుస్నాబాద్ పట్టణంలో సిపిఐ పార్టీ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత భారత కమ్యూనిస్టు

పార్టీ సిపిఐదేనని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. తెలంగాణకు 1947లో స్వాతంత్రం అందరితోపాటు భారతదేశంలో స్వాతంత్రం వచ్చినప్పుడు తెలంగాణకు రాలేదన్నారు.మహారాష్ట్ర ఐదు జిల్లాలు కర్ణాటక మూడు జిల్లలతో కలిసి ఉన్న తెలంగాణను స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. ఆనాటి సిపిఐ నాయకులు ఆంధ్ర మహాసభ అధ్యక్షులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి కార్మిక నాయకులు ముగ్దమ్ గోవిందుల ఆధ్వర్యంలో ఆనాటి సిపిఐ నాయకులు భూమి




భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం 1947లో చేసిన ప్రజా పోరాటలతో నిజాం నవాబుతో పోరాటం నిర్వహించి తెలంగాణ విలీనం అయిందన్నారు. భూస్వాముల ఆగడాలను ఎండగట్టి లక్షలాది ఏకరాల భూములను పేదలకు పెంచేందుకు సాగిన విరోచిత పోరాటంలో అసువులు బాసిన తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ ప్రతి ఏటా సాగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను

సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు నిర్వహించుకుంటున్నామన్నారు.

మహ్మదాపూర్ లో రజాకారు ముకలు చేసిన ఎన్ కౌంటర్ లో అసువులు బాసిన అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతి రెడ్డి మరో 10 మంది అమరుల స్మారక స్థూపం వద్ద శ్రద్దాంజలి ఘటించారు. అనభేరి ప్రభాకర్ రావు అసువులు బాసిన మహమ్మదాపూర్ గుట్టలను పర్యాటక కేంద్రంగా గుర్తించాలని మంత్రి ప్రభాకర్ ని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని, హుస్నాబాద్ లో ప్రజల మధ్య ఉండవలసిన అనభేరి విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని మున్సిపల్ పాలకవర్గాన్ని స్థానిక మంత్రిని కోరారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టులు కాలువలు వెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల సిపిఐ కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, గడిపే మల్లేష్,కర్రె బిక్షపతి,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్ పాటు హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ మూడు జిల్లాల సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,మండలాల కార్యదర్శులు నియోజకవర్గ సిపిఐ నాయకులు సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శులు,ప్రజా సంఘాల నాయకులు, మహిళాలు, కార్యకర్తలు, యువకులు, విద్యార్థులు, సానుభూతి పరులు, రైతులు, కూలీలు, కార్మికులు,హాజరయ్యారు.